ప్రజాశక్తి
శనివారం 27 సెప్టెంబర్ 2025 8 పేజీలు

ప్రకాశం

బాపట్ల

వణికిస్తున్న వైరల్ ఫీవర్స్

- ముందస్తు చర్యల్లో వైద్యశాఖ పనితీరు ప్రశ్నార్థకం
- రోజు రోజుకు పెరుగుతున్న జ్వర పీడితులు

ప్రజాశక్తి-ఒంగోలుబ్యూరో

సీజనల్ వ్యాధులపై వైద్యశాఖ కంటి తుడుపు ప్రచారం తప్ప ఆచరణలో ఎలాంటి చర్యలూ చేపట్టలేక పోతోంది. ముందస్తు చర్యలు ఎక్కడా లేవు. ప్రస్తుతం వైరల్ ఫీవర్స్ జనాన్ని వణికిస్తున్నాయి. ఉపముఖ్యమంత్రి కూడా వైరల్ పీవర్ బారిన పడటంతో హైదరాబాదుకు తరలించినట్లు మీడియాలో సమాచారం వచ్చింది. ఆయకే అలాంటి పరిస్థితి ఎదురైతే సామాన్యుల పరిస్థితి ఏమిటో చెప్పాల్సిన అవసరం లేదు. జిల్లాలో వైరల్ పీవర్స్ వారం రోజులుగా విశ్వరూపం దాల్చుతున్నాయి. జ్వరాలు, జలుబు, శ్వాసకోచ సంబంధ వ్యాధులు, తీవ్రంగా ఉంటున్నాయి. డెంగీ కేసులు పెరుగుతున్నాయి. వాతావరణంలో మార్పులతో పాటు వర్షాలకు తాగునీటి జలాలూ కలుషితం అవుతున్నాయి.ఇవన్నీ సీజనల్ వ్యాధులకు కారణాలుగా ఉంటున్నాయి. ఇపుడు జిల్లాలో వైద్యశాఖ గణాంకాలు ఎలా ఉన్నా ఐదారు లక్షల మందికిపైగా వైరల్‌ఫీవర్స్ బారినపడ్డట్లు సమాచారం. ఎందుకంటే వైద్యశాఖ సిబ్బంది ఎవరూ ఈ జ్వరాలు బారినపడ్డ కుటుంబాలను కలిసే పరిస్థితి లేదు. అందరూ ప్రైవేటు ఆసుపత్రులకే పోతున్నారు. గ్రామాల్లో చిన్నచిన్న వైద్యులను కలిసి రెండు మూడు రోజులు అక్కడ ఇచ్చే మందులు వాడుకుంటున్నారు. నాలుగు రోజుల పాటు చూసి తగ్గకపోతే పట్టణాలకు వస్తున్నారు. ఈ కేసులు లెక్కల్లోకి రావడం లేదు. వైరల్ ఫీవర్స్ వచ్చిన బాధితులు ఒళ్లనొప్పులు, తలనొప్పి, జలుబు,ముక్కులు కారడం లాంటి సమస్యలతో ఆసుపత్రుల పాలవుతున్నారు. ఇపుడు డెంగీ ఉన్నందున అన్ని రకాల రక్తపరీక్షలు అనివార్య మవుతున్నాయి.పరీక్షలకే రెండు వేలకుపైగా ఖర్చవుతోంది.ఇదంతా వైద్యశాఖ అప్రమత్తంగా లేకపోవడమే.డెంగీ పరీక్ష చేసే కిట్లు ప్రాథమిక వైద్యశాలల్లో ఎక్కడా కనిపించడం లేదు. డెంగీ అంటే అనివార్యంగా ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లాల్సిందే. చాలీచాలని సిబ్బంది తోనూ, సౌకర్యాలు లేమితో వైద్యశాఖ మొక్కుబడిగా ఉంది. రోజువారీ పనులకు సంబంధించి రిపోర్టులు పైనుంచి కిందకూ, కింద నుంచి పైఅధికారులకు పంపడానికే వారికి సమయం సరిపోతోంది. వైద్యంపైనా, జనం ఆరోగ్యంపై దృష్టి పెట్టే సమయం చాలా తక్కువగా ఉంటుంది. ఇపుడు ఇదే జరుగుతోంది. సీజనల్ వ్యాధులకు జనాన్ని వది లేయాల్సిందేనా? అప్రమత్తత లేదా. ముందస్తు చర్యలు చేపట్టలేమా? అంటే ప్రభుత్వం తలుచుకుంటే ఏమైనా చేయవచ్చు. మున్సిపాల్టీలు, పంచాయతీల్లో వర్షాలకు కలుషితమైన నీటినే అరకొరగా శుద్ధిచేసి కుళాయి ద్వారా ఇళ్లకు సరఫరా చేస్తున్నారు. ఎక్కడా తాగునీరు సురక్షితంగా కనిపించడం లేదు. పారిశుధ్యం పరిస్థితి ఇదే. దోమలు తీవ్రత పెరిగింది.అందుకు ఆవాసాలు వృద్ధి ఎక్కువగా ఉంది.ఇక వైద్యశాఖ పరంగా సీజనల్ వ్యాధులు వచ్చే సమయాల్లో ఏ చర్యలు చేపట్టాలో జనానికి వివరించే బాధ్యతలో కనిపించడం లేదు. ఈ వైఫల్యాలే వైరల్ పీవర్స్ విజృంభణకు కారణాలు. ఇప్పటికైనా అప్రమత్తం కాకుంటే వీటి భారినపడేవారి సంఖ్య పెరిగే అవకాశం ఉంది.

కొండపి పిహెచ్‌సిలో చికిత్స పొందుతున్న జ్వర పీడితులు

గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

బాపట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

బాపట్లను గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. మాదకద్రవ్య నివారణ జిల్లా స్థాయి కమిటీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలలు, కళాశాలలో ఈగల్ టీం లను ఏర్పాటు చేసి మాదక ద్రవ్య వినియోగం వలన కలిగే నష్టాలను గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. నిషేధిత మాదకద్రవ్యాల వినియోగం, అమ్మకాలపై కేసులు నమోదు చేయాలన్నారు. పాఠశాలల్లో డ్రగ్స్ వద్దు బ్రో అనే నినాదంతో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. అన్ని శాఖలు పోలీస్ శాఖకు సహాయ సహకారాలు అందించాలని ఆయన తెలిపారు. పోలీస్ శాఖకు, ఇతర శాఖలకు మధ్య దూరం ఉండకూడదన్నారు. బాపట్లలో రిహాబిటేషన్ సెంటర్ ఏర్పాటు కోసం ప్రతిపాదన పంపాలని జిల్లా కలెక్టర్ పరిపాలన అధికారికి సూచించారు. మున్సిపల్ కమిషనర్లు, మండల పరిషత్ అధికారులు వారి ప్రాంతాల్లో సమస్యాత్మక ప్రదేశాలు గుర్తించి వాటిలో గల పాత భవనాలు, పాత వాహనాలు ఉండకుండా చూడాలన్నారు. డిఎస్‌పి రామాంజనేయులు మాట్లాడుతూ గంజాయి ఏ రూపంలో ఉంది. అది ఎక్కడి నుంచి వస్తుంది. దాన్ని నిర్మూలించే ▶ 2లో

మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్

కౌలు రైతులకు గుర్తింపు కార్డులేవీ..

- రుణాలు అందక అవస్థలు
- పంటల సాగుకు పెట్టుబడి కోసం బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

కౌలు రైతులు గుర్తింపులు లేక అవస్థలు పడుతున్నారు.పంటల సాగుకు రుణాలు అందక ఆవేదన చెందుతున్నారు. రుణాల కోసం బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

బాపట్ల జిల్లాలో మొత్తం 3,41,974 మంది రైతులు ఉన్నారు. అందులో కౌలు రైతులు 1.62 లక్షల మంది ఉన్నారు. లక్ష మంది కౌలు రైతులకు (సిసిఆర్‌సి) గుర్తింపు కార్డుల జారీ, రూ.150 కోట్ల రుణాల మంజూరు లక్ష్యం. ఇప్పటి వరకూ 41,578 మందికే గుర్తింపు కార్డులు జారీ చేశారు. గతేడాది జిల్లాలో 92 వేల కుటుంబాలకు లక్ష సిసిఆర్‌సి కార్డులు అందజేశారు. అందులో 11,370 కుటుంబాలకు మాత్రమే రూ. 55 కోట్లు రుణం ఇచ్చారు.కౌలు రైతులను ఆదుకునే లక్ష్యాలను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని పలు సమావేశాల్లో చెప్పడమే తప్ప లక్ష్యసాధన దిశగా పనులు జరగడం లేదు. అత్యధిక మంది రైతులు భూములు కౌలుకు తీసుకుని పంటలు సాగు చేస్తున్నారు. భూ యజమానులతో నగదు చెల్లింపు, ధాన్యం ఇచ్చే పద్ధతిలో పంటలు సాగు చేస్తున్నారు.ఈ నేపథ్యంలో కౌలు రైతులకు సిసిఆర్ కార్డులు, బ్యాంకులు రుణాలు ఇవ్వాల్సిఉంది. వాస్తవంగా రుణాలు ఇస్తున్న పరిస్థితి లేదు. కౌలు రైతులకు బ్యాంకుల నుంచి తక్కువ వడ్డీకి పంట రుణాలు అందడం లేదు. దీంతో పంటల సాగు కోసం వారు ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. గతేడాది కౌలు రైతులకు రూ.120 కోట్ల పంట రుణాలు పంపిణీ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే కేవలం రూ.55 కోట్లు మాత్రమే ఇచ్చారు. కౌలు రైతులకు జారీ చేస్తున్న సాగుపత్రాల ఆధారంగా బ్యాంకులు పంట రుణాలు ఇవ్వాలి.కౌలు రైతుల సంఖ్య మేరకు కౌలు కార్డులు ఇవ్వడం లేదన్నారు. బ్యాంకులు కూడా రుణాలు ఇవ్వడం లేదు. కౌలు చట్టంలో వచ్చిన మార్పుల కారణంగా కౌలు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. నూతన కౌలు చట్టం తెస్తామని ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చింది. తాము అధికారంలోకి రాగానే భూ యజమాని సంతకంతో సంబంధం లేకుండా గ్రామ సభల ద్వారా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇస్తామని హామీ ఇచ్చింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు దాటినా కనీసం ముసాయిదా చట్టాన్ని అసెంబ్లీలో ప్రవేశ పెట్టిన పరిస్థితి లేదు. దీంతో కౌలు రైతుల కష్టాలు కొనసాగుతూనే ఉన్నాయి. 2011లో కౌలు రైతులకు గ్రామ సభల ద్వారా రుణ అర్హత కార్డులు అప్పటి ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ కార్డుల వల్ల కౌలు రైతులకు కొంత మేరకు ఉపయోగం కలిగింది. పంట రుణాలు, విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, వ్యవసాయ పనిముట్లు, పంటలు నష్టపరిహారం, పంటల బీమా, పంటను అమ్ముకునే సౌకర్యం కలిగింది. 2019లో అప్పటి వైసిపి ప్రభుత్వం పాత చట్టాన్ని రద్దు చేసింది. పంట సాగు హక్కుదారుల చట్టం తెచ్చింది. భూ యజమాని సంతకం తప్పనిసరి అనే నిబంధన పెట్టింది. భూ యజమానులు అందుకు అంగీకరించలేదు. దీంతో కౌలు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. వాస్తవంగా పంటలు పండించే కౌలు రైతులకు పెట్టుబడి సాయం ▶ 2లో

ఓవర్ టేక్ చేయబోయి బస్సును ఢీకొన్న బైకు ఇద్దరు విద్యార్థులు మృతి

▶ 3లో

'డిజిట్ అరెస్టు' కేసులో ఇద్దరు అరెస్టు

▶ 3లో

సిబిజి ప్లాంట్‌కు భూమి సిద్ధం

సిఎస్‌కు వివరించిన కలెక్టర్ రాజాబాబు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

సిబిజి ప్లాంట్ (కంప్రెస్డ్ బయో గ్యాస్) ప్లాంట్ నిర్మాణానికి భూమి సిద్ధంగా ఉందని రాష్ట్ర ముఖ్య కార్యదర్శి విజయానంద్ దృష్టికి కలెక్టర్ పి రాజాబాబు తీసుకువెళ్లారు. సిబిజి ప్లాంట్ నిర్మాణంపై నెల్లూరు, ప్రకాశం, పల్నాడు, తిరుపతి జిల్లాల కలెక్టర్లతో చీఫ్ సెక్రటరీ విజయానంద్ శుక్రవారం రాజధాని అమరావతి నుంచి వీక్షణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సిబిజి ప్లాంట్‌కి ప్రకాశం జిల్లాలో 4,993 ఎకరాల భూమిని ఎంపిక చేశామని తెలిపారు. మొదటి దశలో భూమి సేకరణ పూర్తయిందన్నారు. కంప్రెస్డ్ బయో గ్యాస్ ప్లాంట్ నిర్మాణానికి భూమి సమస్య ఏమీ లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. నెడ్‌క్యాప్, రిలయన్స్ సంస్థ సంయుక్తంగా ప్రకాశం జిల్లాలో సోలార్ పార్క్ నిర్మించనుందన్నారు. సోలార్ పార్క్ నిర్మాణానికి 90 వేల ఎకరాలు అవసరమని ప్రభుత్వం నుంచి అధికారికంగా లేఖలు అందాయన్నారు. ఇందు కోసం ప్రస్తుతం 55 వేల ఎకరాల భూమిని గుర్తించామని సిఎస్ కి వివరించారు. మిగిలిన భూమి పరిశీలనలో ఉందన్నారు. మూడు రోజుల్లో ప్లాంట్‌కు ▶ 2లో

వీక్షణ సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, జేసీ

గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

(మొదటిపేజీ తరువాయి)

ఉద్దేశంతో ఈగల్ అనే ఆపరేషన్ సంస్థను రాష్ట్ర పోలీస్ శాఖ ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విజయమ్మ, రవాణా శాఖ అధికారి పరంధామ రెడ్డి, ప్రొబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి వెంకటేశ్వరరావు, ఎస్‌సి సంక్షేమ అధికారి రాజ్ దేబోరా, బాపట్ల, రేపల్లె ,చీరాల రెవెన్యూ డివిజన్ అధికారులు, ఇతర లైన్ డిపార్ట్‌మెంట్ అధికారులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులేవీ..

(మొదటిపేజీ తరువాయి)

అవసరం. కౌలు రైతులే ఎక్కువగా పంటల సాగు చేస్తున్నారు. ప్రస్తుత వ్యవసాయ సీజన్‌లోనైనా జిల్లాలోని కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు మంజూరు చేయాల్సిఉంది. బ్యాంకర్లు కూడా ఉదారంగా పంట రుణాలు మంజూరు చేయాల్సి ఉంది. ఈ మేరకు అధికారులు,ప్రజాప్రతినిధులు తగిన చర్యలు తీసుకుని కౌలు రైతులకు మేలు జరిగేలా చూడాల్సిఉంది.

సిబిజి ప్లాంట్‌కు భూమి సిద్ధం

(మొదటి పేజీ తరువాయి)

సంబంధించిన ప్రత్యేక బృందం ప్రకాశం జిల్లాకు రానుందని, దస్త్రాలు సిద్ధం చేయాలని సిఎస్ తెలిపారు. ఈ సమావేశంలో సంయుక్త కలెక్టర్ ఆర్. గోపాలకష్ణ, అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పిఎం కుసుమ్‌కు 77 ఎకరాలు కేటాయింపు

సిఎస్‌కు వివరించిన కలెక్టర్ రాజాబాబు

పిఎం కుసుమ్ కింద ప్రకాశంలో ఏర్పాటు చేసే ప్రాజెక్టుకు 77 ఎకరాల భూమి కేటాయించామని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు చీఫ్ సెక్రటరీ విజయానంద్‌కు తెలిపారు. సూపర్ జిఎస్‌టి సూపర్ సేవింగ్స్, పిఎం కుసుమ్, అన్నా క్యాంటీన్లు, చెత్త సేకరణలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో రాజధాని అమరావతి నుంచి శుక్రవారం వీక్షణ సమావేశం నిర్వహించారు. ప్రకాశం జిల్లా నుంచి కలెక్టర్ పి రాజాబాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మిగిలిన 21 ఎకరాల భూమి ఇవ్వడానికి అన్ని చర్యలు తీసుకుంటు న్నామన్నారు. త్వరలోనే ఈ ప్రక్రియ పూర్తికానుందన్నారు. ప్రజాభిప్రాయంపై దష్టి సారించామన్నారు. పారిశుధ్యంపై ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్ లో నమోదైన ఫిర్యాదులపై తక్షణమే చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ వివరించారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులపై స్పందించి, సమస్య లేకుండా చర్యలు తీసుకున్నామన్నారు. ప్రజల సంతప్తి స్థాయి పెంచడమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నామన్నారు. ఈ సమావేశంలో సంయుక్త కలెక్టర్ ఆర్ గోపాలకష్ణ, అనుబంధశాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న శ్రీకాంత్‌రెడ్డి

నిజమైన సైకో బాలకృష్ణ

వైసిపి యువజన విభాగం జిల్లా అధ్యక్షులు శ్రీకాంత్‌రెడ్డి

ప్రజాశక్తి-మార్కాపురం

మాజీ సిఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని వ్యక్తిగతంగా హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ దూషించడం బాధాకరమని వైసిపి యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు, మాజీ జడ్‌పిటిసి శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. సైకో అనే ముందు ఆ పదానికి బాలకృష్ణ అర్థం తెలుసుకోవాలన్నారు. నిజమైన సైకో నందమూరి బాలకృష్ణ అని చెప్పారు. ఆయన్ను అభిమానంతో కలవాలనుకున్నా.. కొట్టడం, తిట్టడం బాలకృష్ణ నైజమన్నారు. అలాంటి వ్యక్తిని సైకో అంటారని వ్యాఖ్యానించారు. విలేకరుల సమావేశంలో వైసిపి మార్కాపురం పట్టణ నాయకులు గొలమారి సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీలు

ఆదాయ వనరులు సమకూర్చుకోవాలి: ఎంపిపి

ప్రజాశక్తి-గిద్దలూరు రూరల్

గ్రామ పంచాయతీలు సొంతంగా ఆదాయ వనరులు సమకూర్చుకోవాలని గిద్దలూరు మండల పరిషత్ అధ్యక్షురాలు కడప లక్ష్మి అన్నారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశపు హాలులో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్స్, ఇంజనీరింగ్ అసిస్టెంట్స్‌కు రెండు రోజుల పాటు శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కడప లక్ష్మి ముఖ్య అతిథిగా పాల్గొని శిబిరంలో మాట్లాడారు. గ్రామ పంచాయతీల్లో ఇంటి పన్నులు, కొళాయి, ఖాళీ స్థలాలు, షాపుల నిర్వహణ పన్నులు, చెత్త నుంచి సంపద తయారు చేసే కేంద్రాల్లో ఉండే వర్మీ కంపోస్ట్, ఖాళీ సీసాలు, ప్లాస్టిక్ బాటిల్స్, అట్టపెట్టెలు, అమ్మటం మొదలగు వాటి నిర్వహణల ద్వారా పంచాయతీలకు ఆదాయ వనరులను సమకూర్చుకోవచ్చని తెలిపారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి సీతారామారావు మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది పంచాయతీ నిధులు పెంచుకునేందుకు పంచాయతీ కార్యదర్శులకు సహాయ సహకారాలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ లెవెల్ రిసోర్స్ పర్సన్ గురునాథరెడ్డి, కె అంకిరెడ్డి పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్స్, ఇంజనీరింగ్ అసిస్టెంట్స్ పాల్గొన్నారు.

సంతనూతలపాడు: ప్రతి గ్రామ పంచాయతీ ఆదాయ వనరులను పెంపొందించుకు నేందుకు చర్యలు చేపట్టాలని ఎంపీడీవో డిఎస్‌వి ప్రసాద్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నాడు మండల స్థాయిలో జరిగిన గ్రామాల సర్పంచులు, కార్యదర్శులు, డిజిటల్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ల శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సొంతంగా ఆదాయాన్ని పెంచుకునే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. నూరు శాతం ఇంటి పన్నుల వసూలు ప్రక్రియను చేపట్టాలని అన్నారు. లైసెన్స్ ఫీజులు, సంతలు, మార్కెట్లు నిర్వహణ ద్వారా ఆదాయం పెంపునకు నడుం బిగించాలన్నారు. డిప్యూటీ ఎంపీడీవో పి రవికుమార్ రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరిస్తూ ప్రొజెక్టర్ ద్వారా ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. పంచాయతీల ఆదాయ వనరుల పెంపుపై ఆయన పలు సూచనలు ఇచ్చారు.

వికలాంగుల సమస్యలు పరిష్కరించాలి: కలెక్టర్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ఎస్‌టిలు, వికలాంగుల సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ అధికారులను ఆదేశించారు. ఎస్‌టి, వికలాంగులకు ప్రత్యేక గ్రీవెన్స్ కలెక్టరేట్‌లోని పిజిఆర్‌ఎస్ హాలులో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హాలు వద్ద ఆశీనులైన వికలాంగుల వద్దకు కలెక్టర్ ప్రత్యేకంగా వెళ్ళి వారి నుంచి వినతి పత్రాలను స్వీకరించారు. ఎస్‌టిలు, వికలాంగుల నుంచి వచ్చిన వినతులకు తక్షణమే న్యాయం చేస్తామని కలెక్టర్ తెలిపారు. ఎస్‌టిలు, వికలాంగుల నుంచి వచ్చిన ఫిర్యాదులపై అధికారులు స్పందించాలని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి సంయుక్త కలెక్టర్ గంగాధర్‌గౌడ్, అధికారులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

భారీ వర్షాల దృష్ట్యా మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ డి మంజునాథరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ వాతావరణ శాఖ అధికారులు ముందస్తు హెచ్చరికలు చేసిన నేపథ్యంలో మరో రెండు రోజులు అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ప్రజలు జాగ్రత్తలు పాటించాలని కోరారు. ఆయా గ్రామాల ప్రజలు వర్షాల కారణంగా ఎవరు బయటకు వెళ్లవద్దని తెలిపారు. వ్యవసాయ పనులు, పశువులు, గొర్రెలను మేపేందుకు తీసుకొనిపోవద్దని సూచించారు. పాత భవనాలు, మట్టి మిద్దెలల్లో ఉండే ప్రజలు జాగ్రత్తగా ఉండాలని అన్నారు. వర్షాలకు తడవడంతో కూలిపోయే ప్రమాదం ఉంటుందని చెప్పారు. అటువంటి ఇళ్లను ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలని తెలిపారు. చెరువులు, కాలువలు, నీరు నిలిచే ఇతర ప్రాంతాలకు, విద్యుత్ స్తంభాలకు ప్రజలు దూరంగా ఉండాలని సూచించారు. వర్షాల వల్ల ఇబ్బందులు ఉంటే తమ సిబ్బందికి తెలియచేయాలన్నారు. అత్యవసరం అయితే తప్ప ప్రజలు ఎవరూ కూడా బయటకు రావొద్దని కోరారు.

ఎమ్మెల్యే బాలకృష్ణ వ్యాఖ్యలు అనుచితం

మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి

ప్రజాశక్తి-మార్కాపురం

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అసెంబ్లీలో చేసిన వ్యాఖ్యలు అనుచితమని ఎపిఐఐసి మాజీ చైర్మన్, నెల్లూరు వైసిపి పార్లమెంట్ పరిశీలకులు, మార్కాపురం మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో ఖండించారు. సభలో లేని మాజీ సిఎం జగన్‌ను ఉద్దేశించి అమర్యాదకరంగా మాట్లాడటం సిగ్గుచేటన్నారు. ఆ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. జగన్ గురించి మాట్లాడే నైతిక హక్కు బాలకృష్ణకు లేదన్నారు. చిరంజీవి లేదా చంద్రబాబుతో విభేదాలు ఉంటే వాళ్లతోనే బాలకృష్ణ తేల్చుకోవాలన్నారు. వైఎస్ జగన్ గురించి నోటికొచ్చినట్లు మాట్లాడటం సరికాదని హెచ్చరించారు. అసెంబ్లీలో సభ్యసమాజం తల దించుకునేలా ఎమ్మెల్యే బాలకృష్ణ మాట్లాడారని, సభా మర్యాదలు పాటించకుండా ప్రజలకు ఏమి సందేశం ఇవ్వాలనుకుంటున్నారని ప్రశ్నించారు. సభలో హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ తీరు చూశాక ఆయనకు బ్రీత్ ఎనలైజర్ పరీక్షలు చేయాలేమో అనిపించేలా దిగజారి మాట్లాడటం సరికాదన్నారు. సొంత ఇంటిలో కాల్పులు జరిపి మెంటల్ సర్టిఫికెట్ తెచ్చుకున్న సంగతి తెలుగు రాష్ట్ర ప్రజలందరికీ తెలుసునన్నారు. మాజీ సిఎం జగన్ గురించి మాట్లాడేటప్పుడు నోరు అదుపులో ఉంచుకోవాలని సూచించారు. భవిష్యత్తులో ఇలాంటి వ్యాఖ్యలు పునరావృతం అయితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

సచివాలయ అధికారికి వినతిపత్రాన్ని అందజేస్తున్న ఐద్వా నాయకులు

సరుకులు చౌక దుకాణాల ద్వారా అందించాలి: ఐద్వా

ప్రజాశక్తి-సంతనూతలపాడు

నిత్యావసర సరుకులన్నింటినీ చౌక దుకాణాల ద్వారా ప్రజలకు అందించాలని కోరుతూ మండలంలోని పేర్నమిట్ట పరిధిలోని పీర్లమాన్యం 39వ వార్డు సచివాలయ అధికారికి ఐద్వా ఆధ్వర్యంలో శుక్రవారం వినతిపత్రాన్ని అందజేశారు. ముందుగా ఐద్వా ఆధ్వర్యంలో పీర్లమాన్యంలో సంతకాలను సేకరించారు. ఈ సందర్భంగా ఐద్వా మండల అధ్యక్షురాలు బంకా పద్మ మాట్లాడుతూ పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలను అరికట్టడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని అన్నారు. పెట్రోల్ డీజిల్ ధరలు పెరగడంతో దానివలన రవాణా ఛార్జీలు పెరిగి దాని ప్రభావం నిత్యావసర వస్తువుల ధరలపై పడుతోందన్నారు. వ్యవసాయంలో గిట్టుబాటు ధర లభించక రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు అందుబాటులో లేక ప్రజలు అవస్థలు పడుతున్నారని అన్నారు. మన రాష్ట్రంలో కూడా కేరళ రాష్ట్ర ప్రభుత్వం తరహాలో 14 రకాల నిత్యావసర సరుకులను చౌక దుకాణాల ద్వారా ప్రజలకు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు షేక్ మస్తాన్‌బీ, షేక్ నాగూర్‌బీ, లతీబీ తదితరులు పాల్గొన్నారు.

నిరసన ప్రదర్శన

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని కాన్పూర్‌లో ఒక ముస్లిం యువకుడు ఐ లవ్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహిల వసల్లం చెప్పి పోస్టర్ చూపించినందుకు అక్రమంగా అతనిపై కేసు నమోదు చేసి అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం స్థానిక పదో వార్డులోని ముస్లిములు జుమ్మా నమాజ్ అనంతరం ఐ లవ్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ప్రదర్శించారు. ఈ సందర్భంగా హాఫీస్ ఇస్మాయిల్ మాట్లాడుతూ పోస్టర్ చూపించినందుకు వందలమందిపై అక్రమంగా కేసులు నమోదు చేస్తున్న చర్యను యావత్ భారత్ ముక్తకంఠంతో ఖండిస్తోందన్నారు. ముస్లిములు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఒంగోలు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S. 95/2025

కంచి జనార్ధన రెడ్డి ... వాది

Vs

మేడా రామలింగయ్య ... ప్రతివాది

To: మేడా రామలింగయ్య, టీచరు తండ్రి:శీతారామయ్య, M.P.P.S స్కూలు, గుర్రపుశాల పోస్ట్, దూపాడు (SO) యర్రగొండపాలెం (మం), ప్రకాశం జిల్లా. పిన్: 523330.

పై నెంబరున వాది క్లయింటు పరిహారము నిమిత్తము మీపై దావా దాఖలు చేసియున్నారు. సదరు విషయమై మీకు ఆక్షేపణలున్న యడల **13-11-2025 దిన ఉదయం గం॥10.00 లకు** పై కోర్టు వారి ఎదుట స్వయముగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరుఅయి తెలుపు కొనవవలసినది. లేనియడల మీ పరోక్ష మందు తీర్మానినించబడును.

శ్రీ కోర్టు వారి వుత్తర్వులు ప్రకారం

ఇట్లు:

ఒంగోలు P. BALA AMBARISH, B.L.,

తేది: 26-09-2025 వాది తరపు న్యాయవాది

మహారాజశ్రీ దరిశి సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

I.P. 24/2024

పల్లపాటి నాగయ్య ...పిటీషనరు

Vs

సానే గురవయ్య వగైరా ... రెస్పాండెంట్స్

To

R39, పంటా వెంకట రెడ్డి

S/o. నాగయ్య, మర్లపాలెం (గ్రామం) దరిశి మండలం, ప్రకాశం జిల్లా.

పై నెంబరు పిటీషనరు మీపై పిటీషన్ పరిహారం కోరి పిటీషన్ దాఖలు చేసి ఉన్నాడు. కావున నీకు ఏమైన ఆక్షేపణలు ఉన్న యడల పై కోర్టు వారి ఎదుల **తే.07-10-2025 ది ఉదయం గం॥10.30 ని॥లకు** హాజరై తెలుపుకొనవలెను. లేనియడల నీకు పరోక్షమున తీర్మానం చేయబడును.

వాయిదా తేది : 07-10-2025

ఇట్లు:వడ్డమాని శ్రీనివాసశాస్త్రి, B.L.,

దరిశి అడ్వకేట్, దరిశి, ప్రకాశం జిల్లా.

తేది 26-09-2025 సెల్: 9440109385

ఒరిజినల్ డాక్యుమెంటు పోయినది

బాపట్ల జిల్లా, బాపట్ల టౌన్ శృంగారపురం, సి.బి. జెడ్.చర్చి వెనుకవైపు, డోర్. నెంబర్. 6-9-4/A కాపురస్థుడు కాకి రత్నం గారి కుమారుడు కాకి డేవిడ్ రాజు అను నేను తెలియజేయునది ఏమనగా, నేను మా ఇంటి వద్ద నుండి బ్యాంకుకు వెళ్ళుటకు నా యొక్క స్థలానికి సంబంధించిన ఒరిజినల్ డాక్యుమెంట్ నెంబర్. 2792/1997 తీసుకొని ఆటో లో బ్యాంకు కు వెళ్ళి నా యొక్క ఒరిజినల్ డాక్యుమెంట్ చూచుకొనగా కనబడలేదు. అంతట, నేను వచ్చే క్రమంలో మార్గ మధ్యంలో పోయినవి. సదరు డాక్యుమెంట్ కోసం నేను అన్నిచోట్ల వెతికినా కనిపించలేదు. సదరు డాక్యుమెంట్ నెంబర్. 2792/1997 వెనిగండ్ల సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు(గుంటూరు జిల్లా) లో రిజిస్టరు అయిఉన్నవి. ఈ డాక్యుమెంట్ దొరికిన వారు దయ చేసి ఈ క్రింది చిరునామాకు గాని, నా ఫోన్ నెంబర్ కు గాని తెలియపరచవలసినదిగా కోరుచున్నాను.

ఇట్లు

నా యొక్క చిరునామా:

కాకి డేవిడ్ రాజు, S/o. కాకి రత్నం,

శృంగారపురం, డోర్.నెంబర్. 6-9-4/A,

సి.బి.జెడ్. చర్చి వెనుకవైపు,

బాపట్ల టౌన్ ఆఫ్ బాపట్ల డిస్ట్రిక్ట్.

సెల్:9493924441.

నోటీసు

మహారాజశ్రీ 3వ అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) ఒంగోలు

OS NO 1369/2022

అద్దేపల్లి కోటిరత్తమ్మ ...వాది

మరియు

మండవ శేషమ్మ మరియు ఇతరులు ..ప్రతివాదులు

To,

2) మండవ శైలజ, Wo. శివన్నారాయణ, బసవన్న పాలెం గ్రామం, మద్దిపాడు మండలం, ప్రకాశం జిల్లా

3) మండవ మహిత, D/o శివన్నారాయణ, వయస్సు 17సం॥లు, మైనరు గార్డియన్ తల్లిగారు అయిన మండవ శైలజగారు, బసవన్న పాలెం గ్రామం, మద్దిపాడు మండలం, ప్రకాశంజిల్లా.

4) మండవ దీక్షిత D/o. శివన్నారాయణ, వయస్సు 10సం॥లు, మైనరు గార్డియన్ తల్లిగారు అయిన మండవ శైలజగారు, బసవన్న పాలెం గ్రామం, మద్దిపాడు మండలం, ప్రకాశంజిల్లా,

పై తెలుపబడిన దావా ఒ.యస్. నెం. 1369/2022 నందు 2,3,4 ప్రతివాదులైనందున తమరికి శ్రీ కోర్టు వారు పలుమార్లు నోటీసులు పంపియున్నరు, కాని అవి మీకు జారీ కానందున ఈ దావా తాలూకు కోర్టువారి నోటీసును పేపరు ప్రకటన ద్వారా తెలియపరుచుటకు, శ్రీ కోర్టు వారు ఉత్తర్వులు ఇచ్చియున్నారు. కావున పైన పేర్కొన్న దావా నెం. 1369/2022 నందు 2,3,4ప్రతివాదులు అయిన మీరు ఈపేపరు ప్రకటనను దావా నోటీసుగా భావించి తేది. 08.10.2025 ఉదయం 10.30 గంటలకు మహారాజశ్రీ 3వ అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) ఒంగోలు వారి సమక్షంలో తమరు స్వయంగా గానీ, లేదా తమ వకీలు ద్వారా గానీ హాజరై, మీ సంజాయిషీని, మీ వాదనను తెలియపరచవలెను. లేనియెడల మీ పరోక్షమున పై నంబరు దావాను తీర్మానింపబడును.

మహారాజశ్రీ 3వ అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) ఒంగోలు వారి అనుమతిన ఈ ప్రకటన ప్రచురించడమైనది.

ఒంగోలు,

తేది 25-09-2025 ఇట్లు

పిట్టల లక్ష్మయ్య

బి. నాగేశ్వరరావు,

అడ్వకేట్స్‌ఒంగోలు

సెల్ 9848835099.

ప్రజాశక్తి
శనివారం 27 సెప్టెంబర్ 2025

వాహనాన్ని ఓవర్‌టేక్ చేయబోయి..

ఎదురుగా వచ్చిన వాహనాన్ని ఢీకొన్న బైక్

ఇద్దరు విద్యార్థులు మృతి

మృతి చెందిన అన్నదమ్ములు గురువిష్ణు, బ్రహ్మయ్య (ఫైల్)

ప్రజాశక్తి-పొదిలి

మండలంలోని పోతవరం గ్రామం వద్ద శుక్రవారం ఉదయం జరిగిన ఘోరరోడ్డు ప్రమాదం రెండు కుటుంబాల్లో తీరని విషాదం నింపింది. విజయవాడలో చదువుకుంటున్న అక్కా చెల్లెల్ల కుమారులు దసరా పండుగ కోసం ఇంటికి వస్తూ ముందు వెళ్తున్న బస్సును క్రాస్ చేసే క్రమంలో బస్సును ఢీకొని అక్కడికక్కడే మృతి చెందారు. ఈ దుర్ఘటన రెండు కుటుంబాలలో అంతులేని విషాదం నింపింది. అందిన వివరాల మేరకు.. వెలిగండ్ల మండలం పూలికుంట్ల గ్రామానికి చెందిన బండ్లమూడి రాజా, రమణమ్మల కుమారుడు గురువిష్ణు(21) విజయవాడలో డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. రమణమ్మ చెల్లెలు మచ్చా తిరుపతమ్మ, వెంకటసుబ్బయ్యల కుమారుడు బ్రహ్మయ్య(18) విజయవాడలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. అక్కాచెల్లెళ్ల పిల్లలు కావడంతో అన్యోన్యంగా ఉంటూ రాకపోకలు సాగిస్తూ ఈ దసరా పండక్కి ఇంటికి వచ్చేందుకు విజయవాడలో స్నేహితుని మోటార్ బైక్ తీసుకొని శుక్రవారం ఉదయం తమ గ్రామాలకు బయలుదేరారు. వారు ప్రయాణిస్తున్న పల్సర్ వాహనం పొదిలి మండలం పోతవరం-కంభాలపాడు గ్రామాల మధ్య సచివాలయం ఎదురుగా ఒంగోలు-నంద్యాల రాష్ట్రీయ రహదారిపై ముందు వెళ్తున్న వాహనాన్ని అధిగమించే ప్రయత్నంలో ఎదురుగా వస్తున్న ఒక ప్రైవేటు కళాశాలకు చెందిన బస్సును ఢీకొట్టడంతో వారు అక్కడికక్కడే మృతి చెందారు. మోటార్ సైకిల్‌కు ఎటువంటి ప్రమాదం లేకపోయినప్పటికీ వేగంగా బస్సును ఢీకొట్టడంతో ఎగిరి పక్కన పడ్డ వారిపై అదే బస్సు టైర్ ఎక్కినట్లుగా భావిస్తున్నారు. వారి తలలు ఛిద్రమై హెల్మెట్ ఉన్న ఒక యువకుడితో సహా అన్నదమ్ములిద్దరూ సంఘటన స్థలంలోనే ప్రాణాలు కోల్పోయారు. అత్యంత హృదయ విధారకరమైన ఈ సంఘటనతో ఒకసారిగా చలించిపోయిన స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ప్రమాదం జరిగిన తీరును పరిశీలించి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సంఘటనకు కారణమైనదిగా భావిస్తున్న ప్రైవేట్ కళాశాల బస్సును, ఆ బస్సు డ్రైవర్ అందులోని విద్యార్థులను దించేసి పోలీస్ స్టేషన్ వద్ద ఆపి పరారైనట్లు సమాచారం. కుమారుల మరణ వార్త తెలిసిన కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు పొదిలికి చేరుకొని సంఘటన జరిగిన తీరు తెలుసుకొని ఒకసారిగా శోకసంద్రంలో మునిగిపోయారు. పొదిలి ఎస్ఐ వి.వేమన సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పంచనామా అనంతరం మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించనున్నారు. చేతికి అంది వచ్చిన చెట్టంత కొడుకులు ఉన్నత విద్యాభ్యాసం చేసి తమ కుటుంబాల్లో వెలుగులు నింపుతారని ఆశించిన ఆ కుమారులు, తల్లిదండ్రులను శోకసంద్రంలో ముంచి అర్ధాంతరంగా తనువు చాలించడంతో రెండు కుటుంబాలు శోకసంద్రంలో మునిగిపోయాయి.

ఆర్‌ఎంపి వైద్యశాలలను తక్షణమే మూసేయండి

డిప్యూటీ డీఎంహెచ్‌వో విస్తృత తనిఖీ

గడువు ముగిసిన మందులు వాడుతున్నట్లు గుర్తింపు

వైద్యం వికటించి వ్యక్తి మృతి చెందిన ఘటనపై విచారణ

మందులను పరిశీలిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-కొండపి

కొండపిలో శుక్రవారం డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ వాణిశ్రీ ఆర్‌యంపి వైద్యం వలన మృతి చెందిన ప్రయివేటు వైద్యశాలను తనిఖీ చేశారు. శుక్రవారం ప్రజాశక్తిలో ప్రచురించిన 'వైద్యం వికటించి వ్యక్తి మృతి' వార్తకు జిల్లా వైద్యులు స్పందించారు. ఆర్‌యంపి వెంకటేశ్వర్లు వైద్యశాలను తనఖీ చేసి విచారించారు. వాడిన మందుల వివరాలను లిఖిత పూర్వకంగా తీసుకున్నారు. అనంతరం వైద్యశాలను తనఖీ చేయగా కాలంతీరిన మందులు, ఎక్కువ మోతాదుగల మందులు వాడుతున్నట్లు గుర్తించారు. అర్హత లేకపోయిన రక్తపరీక్షలు, ఈసిజి, ఎక్స్‌రేలు తీయడాన్ని వారు గుర్తించి ఆర్‌యంపి వైద్యుడుని ప్రశ్నించారు. తక్షణమే వివరణతో కూడిన సమాచారం జిల్లా కేంద్రానికి వచ్చి ఇవ్వాలని ఆమె ఆదేశించారు. అప్పటి వరకు వైద్యశాలను మూసివేయాలని ఆదేశించారు. పక్కనే ఉన్న మరో ఆర్‌యంపి వైద్యశాలను తనిఖీ చేశారు. అతిశక్తివంతమైన స్టెరాయిడ్ ఇంజక్షన్లు వాడుతున్నట్లుగా గుర్తించి అవాక్కయ్యారు. వెంటనే ఈ వైద్యుడుని కూడా వైద్యశాలను మూసివేయించి జిల్లా కేంద్రానికి రావాలని తమ సిబ్బందికి సూచించారు. అక్కడ నుంచి పొదిలి రోడ్డులో ఉన్న దుర్గాదేవి ఆసుపత్రికి వెళ్లి అక్కడ వైద్యుడుతో మృతి చెందిన వ్యక్తికి చేసిన వైద్యం, అతని స్థితి గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కొండపిలో ఉన్న ఆర్‌యంపి వైద్యశాలలను అన్నింటినీ మూసి వేయించి జిల్లా కేంద్రానికి రావాలని బృందానికి తెలియచేశారు. అలాగే పిహెచ్‌సి వైద్యులు ఆర్‌ఎంపి వైద్యశాలను ప్రతినెలా తనిఖీ చేయాలని వైద్యురాలికి సూచించారు. ఈ కార్యక్రమంలో పెట్లూరు పిహెచ్‌సి వైద్యుడు డాక్టర్ ప్రియాంక, డాక్టర్ వీరేంద్ర, యంపిహెచ్‌వో మోహనరావు పెట్లూరు ఆరోగ్య వైద్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

'డిజిటల్ అరెస్టు' కేసులో ఇద్దరు అరెస్టు

వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ ఉమామహేశ్వర్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

చీరాల విశ్రాంత వైద్య ఉద్యోగి నుంచి డిజిటల్ అరెస్ట్ పేరుతో రూ.1 కోటి 10 లక్షల నగదును సైబర్ నేరానికి పాల్పడిన కేసులో కర్నాటకకు చెందిన ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి, వారి బ్యాంకు ఖాతాలో రూ.2.5 లక్షల నగదును పోలీసులు రికవరీ చేశారు. శుక్రవారం పోలీస్ ప్రధాన కార్యాలయంలోని సమావేశ హాలులో జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ మీడియా సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. సైబర్ నేరస్తుల చేతిలో మోసపోయిన చీరాలకు చెందిన విశ్రాంత వైద్యుడు చీరాల 1టౌన్‌లో ఫిర్యాదు చేశారు. బాపట్ల ఐటి కోర్ సిఐ నాయబ్ రసూల్, ఆర్.ఐ శ్రీకాంత్ ఆధ్వర్యంలోని టెక్నికల్ బృందం ఇచ్చిన సమాచారంతో కర్ణాటకకు చెందిన ఇద్దరిని అరెస్టు చేసి వారి నుంచి రెండు ఫోన్లు, రూ.2.5 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ డిజిటల్ అరెస్ట్ అనేది లేదని, భయభ్రాంతులకు గురై అపరిచితులను నమ్మి మోసపోవద్దని సూచించారు. ఈ కేసులో ప్రతిభ చూపిన పోలీస్ అధికారులను, సిబ్బందిని, ఐ.టి కోర్ బృందాన్ని ఎస్పీ అభినందించారు.

అసభ్యకర పోస్టు పెట్టిన వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా : సోషల్ మీడియాలో అసభ్యకరంగా పోస్టు పెట్టిన వ్యక్తిని పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయన కుటుంబ సభ్యులను వ్యక్తిత్వ హననం చేస్తూ అసభ్యకర పదజాలంతో సోషల్ మీడియాలో పోస్టులు పెట్టాడని ద్రోణాదుల గ్రామానికి చెందిన గద్దె అశోక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసునమోదు చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడు వి.భాగ్యరావును అరెస్టు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఉమామహేశ్వర్ మాట్లాడుతూ సోషల్ మీడియాపై నిఘా పెట్టామన్నారు. మహిళలు, ఇతరులను కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేసినా, వ్యక్తిత్వ హననానికి పాల్పడిన, అసభ్యకరమైన రీతిలో పోస్టులు పెట్టిన, కులాలు, మతాల మధ్య విద్వేషాలు సష్టించే విధంగా పోస్టులు చేసిన అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తిచేయాలి

ప్రజాశక్తి-కనిగిరి : మున్సిపాలిటీలో మంజూరైన పనులు త్వరగా పూర్తిచేసి కనిగిరి మున్సిపాలిటీని అభివృద్ధి చేయనున్నట్లు మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ అన్నారు. శుక్రవారం సమస్య పరిష్కారంలో భాగంగా 15వ వార్డులో పర్యటించి ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో అడిగి తెలుసుకోగా వార్డులో డ్రైనేజ్ కాలువలు, సిసి రోడ్లు త్వరితగతన ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ నూతనంగా మంజూరైన సీసీ రోడ్లు, డ్రైనేజ్ కాలువలు పనులు నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ నిర్ణీత కాల వ్యవధిలో త్వరితగతంగా పూర్తి చేయాలని అధికారులకు కాంట్రాక్టులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మాణిక్యరావు, కో ఆప్షన్ సభ్యులు గూడూరి అబ్రహం లింకన్, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

కూలిన మట్టి ఇల్లు.. తప్పిన ప్రమాదం

కూలిన ఇల్లు

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్ : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా మార్కాపురం పరిసర ప్రాంతాలలో ఓ మోస్తరు నుంచి అతి భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో మండల పరిధిలోని కోలభీమునిపాడు గ్రామంలో పాత మట్టి మిద్దె శుక్రవారం ఒక్కసారిగా కుప్ప కూలింది. స్లాబ్ కూలిన సమయంలో ఇంట్లో ఉన్న కొందరు వ్యక్తులు ఒక్కసారిగా బయటికి పరుగులు తీశారు. కొంచెం కొంచెంగా స్లాబ్ విరిగిపడుతూ ఒక్కసారిగా కూలడంతో విలువైన ఇంటిలోని వస్తువులన్నీ ధ్వంసమయాయని ఇంటి యజమాని డోలు కిరణ్ కన్నీటి పర్యంతమవుతున్నారు. ఈ సంఘటనతో తమ కుటుంబం పూర్తిగా రోడ్డుపై పడిందని, ప్రభుత్వమే ఆదుకోవాలని కిరణ్ వేడుకుంటున్నాడు. ఈ ఘటనలో ఎటువంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.

హిజ్రాలకు పోలీసుల కౌన్సిలింగ్

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

హిజ్రాల వల్ల ఒంగోలు నగర ప్రజలు పడుతున్న భాదలను కొందరు జిల్లా ఎస్పీ దృష్టికి తీసుకురాగా స్పందించిన ఎస్పీ నగరంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని పోలీసు సిబ్బందిని ఆదేశించారు. నగరంలోని త్రోవగుంట నుంచి నాగులుప్పలపాడు పాడు వెళ్లే రోడ్డు, కిమ్స్ హాస్పిటల్ ఏరియా, మార్కెట్ యార్డ్ సమీపంలో, మామిడిపాలెం చెరువు ఏరియా, ఒంగోలు టౌన్ పరిధిలో పోలీస్ అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ప్రజలను ఇబ్బందులు పెడుతున్న కొంత మంది హిజ్రాలను పోలీసులు గుర్తించారు. హిజ్రాలకు పోలీసు సిబ్బంది కౌన్సిలింగ్ ఇచ్చారు. ప్రజల పట్ల హిజ్రాలు అమర్యాదగా వ్యవహరించడం వల్లన తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గుర్తు చేస్తూ కౌన్సిలింగ్ ఇచ్చారు. రోడ్డు మీద వెళ్ళుతున్న బైక్స్, కార్లు, లారీ అడ్డంగా వచ్చి డబ్బులు వసూలు చేయడం తప్పన్నారు. మరోసారి ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే సహించేది లేదన్నారు.

గుంత పూడ్చిన దృశ్యం

రోడ్డు పక్కన గుంతలు పూడ్చివేత

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి-సీఎస్‌పురం రూరల్

మండలంలోని డిజిపేట రోడ్డు మార్జిన్‌లలో ఉన్న గోతులను పూడ్చి అధికారులు సమస్యను పరిష్కరించారు. డిజిపేట గ్రామ పరిసరాలలో బిఎస్ఎన్ఎల్ గోతులు తీసి పూడ్చకపోవడంతో ఇబ్బందులను ప్రస్తావిస్తూ 'గోతులు తీశారు.. పూడ్చడం మరిచారు' శీర్షికన శుక్రవారం ప్రజాశక్తి ప్రచురించిన కథనానికి బిఎస్ఎన్ఎల్ అధికారులు స్పందించారు. బిఎస్ఎన్ఎల్ పామూరు జేఈ శివాజీ ఆదేశాలతో డిజిపేట ఎస్సీ కాలనీ వద్ద నుంచి కొండబోయినపల్లి గ్రామం వరకు ఉన్న అన్ని గోతులను పూడ్చి వేసి సమస్యను పరిష్కరించారు.

డిజిపేటలో వైద్యశిబిరం

ప్రజాశక్తి-సీఎస్‌పురం రూరల్

మండలంలోని డిజిపేట గ్రామంలో వైద్యులు మహేష్ రోగులకు బిపి, షుగర్ తదితర వ్యాధులకు చికిత్సలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీటీసీ సభ్యుడు గోదాసు జయరాములు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ప్రజారోగ్యం కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు చెప్పారు.

డ్రోన్‌తో మందులు పిచికారీ చేస్తున్న దృశ్యం

డ్రోన్‌తో మందుల పిచికారీ

ప్రజాశక్తి-పీసీపల్లి

మండలంలోని గుదేవారిపాలెం, పెదఅలవలపాడు గ్రామాల్లో ఆత్మ సౌజన్యంతో ఏవో రంగకృష్ణ ఆధ్వర్యంలో డ్రోన్ ద్వారా మందులు పిచికారీ చేయడంపై క్షేత్రస్థాయి ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో రంగకృష్ణ మాట్లాడుతూ డ్రోన్ టెక్నాలజీ ద్వారా మందులు పిచికారీ చేయడం ద్వారా పంటలకు రసాయనాలను, ఎరువులను ఖచ్చితంగా మరియు సమర్ధవంతంగా స్ప్రే చేయడానికి ఉపయోగపడుతుందన్నారు. డ్రోన్ల ద్వారా నానో యూరియా మరియు నానో డిఏపి వంటి వాటిని కూడా స్ప్రే చేయవచ్చన్నారు.

పరామర్శిస్తున్న సిపిఎం నాయకులు

సిపిఎం నేతల పరామర్శ

ప్రజాశక్తి - బల్లికురవ

మండలంలోని చెన్నుపల్లికి చెందిన సిపిఎం సానుభూతి పరులైన సీనియర్ అడ్వకేట్ తేలప్రోలు వెంకటప్పయ్య ఆయన సతీమణి రామ తులసమ్మలను సిపిఎం నాయకులు నాగబోయిన రంగారావు, జాలా అంజయ్య, సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య, కందిమళ్ల రామకోటేశ్వరరావు మర్యాద పూర్వకంగా కలిసి పరామర్శించారు. సిపిఎం అలనాటి ఉద్యమాలు, నాయకులు అనుసరించిన విధానాలు, త్యాగనిరతిని గుర్తు చేసుకున్నారు. పుచ్చలపల్లి సుందరయ్య, మాకినేని బసవపు అన్నయ్య వంటి పెద్ద నాయకుల గురించి, వారితో వీరికి ఉన్న సంబంధాలు, వారితో కలిసి పంచుకున్న అనుభవాలు ముచ్చటించారు. నేటి యువత వారి పోకడలు సమాజంలో వస్తున్న మార్పులు చర్చకు వచ్చాయి. గ్రామాల్లో గత ఐదు దశాబ్దాల్లో వ్యవసాయంలో వచ్చిన మార్పులు, ప్రభుత్వ విధానాలు ప్రజలకు జరుగుతున్న నష్టాలు ప్రస్తావనకు వచ్చాయని అన్నారు. గ్రామాలు విడిచి ప్రజలు పట్టణాలకు వలస పోయి గ్రామాల్లో పనిచేసే వారు దొరకక పడే ఇబ్బందులు గురించి చర్చించారు. రాబోయే కాలంలో వ్యవసాయం ఎలా ఉండబోతుందనేది చర్చించారు. వీరితోపాటు మాకినేని బసవ పున్నయ్య మనవడైన సిసిరి, సిపిఎం జిల్లా సభ్యులు తంగిరాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న నాయకులు

బాషాకు మాతృ వియోగం

ప్రజాశక్తి - యద్దనపూడి

సిపిఐ (ఎంఎల్) రెడ్ స్టార్ నాయకులు షేక్ మహ్మద్ బాషా మాతృ మూర్తి షేక్ మైమూన్ బి (76) మృతి చెందారు. పలువురు రాజకీయ, ప్రజా సంఘాల నాయకులు మృతురాలికి నివాళి అర్పించారు. బాషా కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. మార్టూరులో మృతురాలికి అంత్యక్రియలు నిర్వహించారు. మృతురాలికి బాషాతో పాటు ముగ్గురు కుమార్తెలు, అల్లుళ్ళు, మనుమలు, మనుమరాండ్రు ఉన్నారు. నివాళులరర్పించి వారిలో ఉమ్మడి ప్రకాశం జిల్లా బహుజన నాయకుడు, అంబెడ్కర్ జ్ఞాన సొసైటీ అధ్యక్షులు మైలా నాగేశ్వరరావు, పర్చూరు ఎస్‌సిఆర్‌పి కన్వీనర్ రాము, సిపిఐ ఎంఎల్ రెడ్ స్టార్ ఎపి కార్యదర్శి వెంకటేశ్వరరావు, సుబ్బారావు, అజయ్, బాషా, రఫీ, బుడే, జాన్ బాషా ఉన్నారు.

అవార్డు అందుకుంటున్న ఉపాధ్యాయురాలు శారద

శారదకు జాతీయ అవార్డు

ప్రజాశక్తి - యద్దనపూడి

మండలంలోని సూరవరపుపల్లి పాఠశాల్లో పని చేస్తున్న ఎంఎల్‌వీఆర్ ఎల్‌పి శారదకు హైదరాబాద్‌కు చెందిన శారద ఎడ్యుకేషన్ సొసైటీ జాతీయ టీచర్స్ ఎక్స్‌లెన్స్ అవార్డుకు ఎంపిక చేసి పూలు శాలువాతో సత్కరించి జ్ఞాపిక, అవార్డు ధ్రువీకరణ పత్రం ఇచ్చారు. హైదరాబాద్‌లో జాతీయ అవార్డు స్వీకరించిన తరువాత ఆమె మాట్లాడుతూ ఈ అవార్డు తన భాధ్యతను మరింత పెంచిందని అన్నారు. అవార్డు అందుకొని సత్కరం పొందిన ఆమెను హెచ్‌ఎం వెంకట నారాయణ, శ్రీను, రామ తులసి, కొండమ్మ, ఎంఇఒ కార్యాలయం సిబ్బంది, గ్రామ ప్రజలు అభినందించారు.

సిఐటియు మహాసభలకు కార్మికులు తరలి రావాలి

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షుడు మణిలాల్

ప్రజాశక్తి - రేపల్లె

కార్మిక, కూలీ పోరాటాల ఉద్యమాల చరిత్ర గలిగిన రేపల్లెలో సిఐటియు జిల్లా ద్వితీయ మహా సభలకు ఏర్పాట్లు సిద్ధం అయ్యాయని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ మణిలాల్ పేర్కొన్నారు. జిల్లా మహాసభలకు పట్టణంలో ప్రధాన సెంటర్లో జెండాలు, తోరణాలతో అలంకరణ చేశారు. బహిరంగ సభలో ప్రదర్శించడానికి పాటలు, కోలాటం శిక్షణ, రేపల్లెలో శనివారం జరిగే బహిరంగ సభకు తరలిరావాలని మైక్ ప్రచారం నిర్వహించి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. బస్టాండ్ వద్ద సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ మణిలాల్ మాట్లాడుతూ సభకు సిఐటియు రాష్ట్ర నాయకులు కె ధనలక్ష్మి, కె ఉమామహేశ్వరరావు, డి రమాదేవి, సిహెచ్ గంగయ్య, సిహెచ్ మజుందార్, పి రేఖ ఎలిజిబెత్, కె ఝాన్సీ పాల్గొంటారని తెలిపారు. జిల్లాలోని పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు, ఆటో, ముఠా, అంగన్‌వాడి, ఆశ, ఐకెపి విఒఎ, మున్సిపల్, ఆర్టీసీ తదితర ప్రభుత్వ, ప్రైవేటు కార్మికుల సమస్యలపై భవిష్యత్ పోరాట కార్యక్రమాలు నిర్దేశించుకోవడానికి, చారిత్రాత్మకమైన కూలీ, రైతాంగ పోరాటాలు, పోలీసు కాల్పుల్లో అమరులైన వామపక్ష ఉద్యమకారులు చరిత్ర కలిగిన రేపల్లెలో సెప్టెంబర్ 27, 28 తేదీల్లో శ్రీ శుభంకర ఏలేట్‌లో జరుగునున్న సిఐటియు జిల్లా మహాసభల్లో బాగంగా 27న సాయంత్రం 3గంటలకు కార్మిక ప్రదర్శన, బహిరంగ సభ జరుగుతుందని, కార్మికులు జయప్రదం చేయాలని కోరారు. సిఐటియు నాయకులు కె రమేష్, కె ఝాన్సీ, బి నాగరాజు, కెవి లక్ష్మణరావు, పి విజయ్, సిహెచ్ ప్రకాష్, వై నవీన్ పాల్గొన్నారు.

వేమూరు : సిఐటియు జిల్లా 2వ మహాసభలు ఈనెల 27, 28 తేదీల్లో రేపల్లెలో జరుగు తున్నాయని, మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు మండల కార్యదర్శి బి అగస్టిన్ కోరారు. మండలంలో ఆటో, ముఠా, అంగన్‌వాడి, ఆశ కార్యకర్తలను కలిసి సిఐటియు జిల్లా మహాసభలకు తరలి రావాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 27న మధ్యాహ్నం 3గంటలకు కార్మిక ప్రదర్శన, బహిరంగ సభ జరుగుతుందని తెలిపారు. కార్మికులు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని అన్నారు. నిత్యం కార్మిక సమస్యలపై పోరాటాల చేసే సిఐటియు భవిష్యత్ కార్యాచరణ కోసం జరుగుతున్న మహాసభలో జిల్లాలో కార్మికులు ఎదుర్కొన్న సమస్యలపై చర్చించి నిర్ణయాలు చేయనున్నట్లు తెలిపారు. కార్మికవర్గం, అంగన్‌వాడీ, ఆశాలు కార్యకర్తలు, పంచాయతీ కార్మికులు పాల్గొనాలని కోరారు.

ముఠా కార్మికులతో మాట్లాడుతున్న ఆగస్టీన్

మున్సిపల్ కార్యాలయం ముట్టడి

◆ జగనన్న కాలనీ వాసుల ఆందోళన ◆ కనీస వసతులు కల్పిస్తామన్న కమిషనర్

కాలనీవాసులతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్

ప్రజాశక్తి - బాపట్ల

జగనన్న కాలనీలో సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేస్తూ మున్సిపల్ కార్యాలయాన్ని శుక్రవారం ముట్టడించారు. పాడిసన్ పేట జగనన్న కాలనీలో ఇబ్బందులు ఎదుర్కొంటూ జీవనం సాగిస్తున్నామని సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కాలనీవాసులు తమ ఇబ్బందులను అర్జీ రూపంలో మొరపెట్టుకున్నారు. అయితే ఆ కాలనీకి సంబంధించి మౌలిక సదుపాయాల కల్పనలో ఏ శాఖకు ఆ శాఖ తమకు సంబంధం లేదని సమాధానం చెప్పడంతో విసుపోయిన కాలనీ వాసులు పెద్ద ఎత్తున మున్సిపల్ కార్యాలయాన్ని శుక్రవారం ముట్టడించారు. ఈ సందర్భంగా సిఐటియు పట్టణ నాయకుడు కె శరత్ మాట్లాడారు. ప్యాడిసన్ పేట జగనన్న కాలనీలో నివాసం ఉంటున్న ప్రజలను ఏ వార్డు పరిధిలోకి చేర్చకుండా నివాసాలకు ఇంటి నెంబర్లు ఇవ్వలేదని తెలిపారు. కాలనీలో అంతర్గత రోడ్ల నిర్మాణం నోచుకోలేదని అన్నారు. త్రాగునీరు, విద్యుత్ వీధి దీపాలు లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. దీనికి తోడు అకాల వర్షాలు కారణంగా రోడ్లపై వర్షపు నీరు నిలిచి విషపూరిత కీటకాలు, పాములు చేరడంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారని తెలిపారు. కాలనీవాసులతో మునిసిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి మాట్లాడుతూ రేపటి నుండి ఇళ్ళ కొలతలు వేసి డోర్ నెంబర్లు ఇస్తామని తెలిపారు. రోడ్లు సరి చేస్తామని చెప్పారు. వీధి దీపాలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని శరత్ తెలిపారు. కార్యక్రమంలో ప్యాడిసన్ పేట లే అవుట్ అభివృద్ధి కమిటీ సభ్యులు శ్రీనివాస్, నాని, లోకేష్, సురేష్, కార్తీక్, భాగ్యలక్ష్మి, సల్మా, లలిత కుమారి పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడించిన మహిళలు

మాట్లాడుతున్న చెరుకూరు పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ అనూజ

మహిళల ఆరోగ్యంతో అభివృద్ధి

ప్రజాశక్తి - పర్చూరు

మహిళలు ఆరోగ్యంగా ఉంటే ఆ కుటుంబం బాగుంటుందని చెరుకూరు పిహెచ్ వైద్యులు డాక్టర్ అనూజ తెలిపారు. మండలంలోని ఉప్పుటూరు జడ్పీ స్కూల్లో చెరుకూరు పిహెచ్సి వైద్య బృందం ఆరోగ్య శిబిరం శుక్రవారం నిర్వహించారు. మహిళలు ఆరోగ్యంగా ఉండాలంటే ప్రారంభ దశలోనే వ్యాధులను గుర్తించి వాటికి చికిత్స అందించడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని తెలిపారు. శిబిరంలో రోగులకు రక్త పరీక్షలు, బీపీ పరీక్షలు, టీబి, క్యాన్సర్ పరీక్షలు నిర్వహించారు. 76 మందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఇఓ ఎంవి సత్యనారాయణ, ఆశ, అంగనవాడీ కార్యకర్తలు, ఎఎన్ఎంలు, పిహెచ్‌సి వైద్య సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమంలో హెూమియో వైద్యులు డాక్టర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మోటర్ మెకానిక్‌ను పరిశీలిస్తున్న విద్యార్థులు

మోటార్ మెకానిక్‌పై అవగాహన

ప్రజాశక్తి - పంగులూరు

మండలంలోని కొండ మంజులూరులోని పి ఎం శ్రీ జెడ్‌పి ఉన్నత పాఠశాలలో ఎపి సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో దసరా సెలవుల్లో ఒకేషనల్ ఇంటర్న్ షిప్ శుక్రవారం నిర్వహిస్తున్నారు. ఈ నెల 22నుండి అక్టోబర్ 1వరకు నిర్వహిస్తున్నట్లు హెచ్‌ఎం ఇమ్మడిశెట్టి అనిత తెలిపారు. ఆటోమోటివ్ ట్రేడ్‌కు సంబంధించిన ట్రైనర్ జి రవీంద్ర విద్యార్థులను ప్రతిరోజు స్థానిక ఎస్ఎఆర్ ఆటో మొబైల్స్ షాపుకు తీసుకెళ్లి ద్విచక్ర వాహన విడి భాగాలు, పరికరాలు, రిపేర్లు చేసే విధానంపై అవగాహన కలిగిస్తున్నారని తెలిపారు. రిటైల్ ట్రేడ్ ట్రైనర్ సిహెచ్ గంగా భవాని ప్రసాద్ స్థానిక జిఎన్ఆర్ జనరల్ స్టోర్స్, రాజారావు టెక్స్టైల్స్, నాగమ్మ జనరల్ స్టోర్స్‌లలో విద్యార్థులకు ప్రోడక్ట్ ల్యాబ్లింగ్, బిజినెస్ చేసే పద్ధతి, కస్టమర్స్‌తో ఎలా విషయాన్ని డీల్ చేయాలనే అంశాలపై అవగాహన కలిగిస్తున్నారని తెలిపారు. ఈ ఇంటర్నెన్ షిప్ తన పర్యవేక్షణలో జరుగుతుందని తెలిపారు. ఈ ఒకేషనల్ ట్రేడ్స్‌లో విద్యార్థులు 10వ తరగతిలో పరీక్షలు రాసి, సర్టిఫికెట్స్ పొందుతున్నారని, ఈ ఇంటర్నెన్ షిప్ ప్రోగ్రాం ద్వారా విద్యార్థులు నైపుణ్యాలు మెరుగుపడతాయని చెప్పారు. స్వయం ఉపాధి అవకాశాల ద్వారా ఇంకొంతమందికి చేయుత ఇవ్వగలరని తెలిపారు.

కుందేరు సమస్యను పరిష్కరించాలి

శాసన సభలో ఎమ్మెల్యే ఎంఎం.కొండయ్య

అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య

ప్రజాశక్తి - చీరాల

నియోజకవర్గంలో ప్రధాన సమస్యగా ఉన్న కుందేరు వాగు ప్రక్షాళన అంశాన్ని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అసెంబ్లీలో ప్రస్తావించారు. కుందేరు వాగు శుభ్రపర్చి మురిగు నీటి, వ్యర్థాల నిర్మూలనతో పాటు ప్రజా ప్రయోజనాలకు అనువుగా మార్చుకోవచ్చని తెలిపారు. బాపట్ల నుంచి చీరాల, పర్చూరు నియోజకవర్గాల వరకు 25 కిలోమీటర్ల మేర ప్రవహిస్తున్న కుందేరు వాగు గతంలో వరదల నుండి ప్రజలను కాపాడినప్పటికీ ప్రస్తుతం చెత్త, వ్యర్థాలతో నిండిపోవడంతో దుర్వాసన వ్యాపించి రోగాలకు నిలయంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. 2011లో పంచాయతీరాజ్ శాఖ స్థానిక పంచాయతీ కార్యదర్శులకు ఆక్రమణలు అడ్డుకునే ప్రత్యేక హక్కులు ఇచ్చిందని అన్నారు. ఆ సమయంలో కృష్ణా డెల్టా చీఫ్ ఇంజనీర్ కుందేరు అభివృద్ధిపై సమగ్ర నివేదిక ఇచ్చరని అన్నారు. 19 మీటర్ల వెడల్పుతో అభివృద్ధి చేయవచ్చని, మిగిలిన భూములను ప్రభుత్వ అవసరాలకు వినియోగించుకోవచ్చని సూచించిన విషయాన్ని సభ దృష్టికి తీసుకువచ్చారు. కుందేరు వాగు రెండు వైపులా రహదారులు అభివృద్ధి చేసేందుకు డిపిఆర్ఓ దశలోనే నిలిచిపోయిందని, రూ.89 కోట్లతో ప్రాజెక్టు గురించి ప్రస్తావించారు. ప్రక్షాళన ప్రక్రియ తిరిగి ప్రారంభిస్తే ప్రజలకు అనేక ప్రయోజనాలు చేకూరతాయని అన్నారు. ఎంఎస్ఎంఈ పార్క్ వంటి అభివృద్ధిని ఆ ప్రాంతంలో ఏర్పాటు చేసుకోవచ్చని సూచించారు. ప్రజా ఆరోగ్యం, అభివృద్ధి పరంగా అత్యంత కీలకమైన సమస్యను ప్రభుత్వం అత్యవసరంగా పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

హెల్త్ కార్డులకు బయోమెట్రిక్ తిరకాసు

- వేలిముద్రలు పడక ఇక్కట్లు
- జూన్ నుంచి అమలులో మార్పులు

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ.

ఇహెచ్ఎస్ హెల్త్ కార్డులపై వైద్యం కోసం ఆసుపత్రులను ఆశ్రయిస్తున్న లబ్ధిదారులకు వైద్యసేవలు అందడం లేదు. వారికి ఆసుపత్రుల్లో చుక్కెదురవుతోంది. గత మే 30న ఇహెచ్ఎస్ లబ్ధిదారులకు బయో మెట్రిక్ ప్రక్రియ తప్పనిసరి చేస్తూ ఎన్ టిఆర్ సేవాట్రస్ట్ నిబంధనలు పెట్టింది. దీంతో ఇహెచ్ఎస్ లబ్ధిదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నెల 24న కంటి శస్త్రచికిత్స కోసం ఓ ప్రైవేట్ (పేనల్) ఆసుపత్రికి వెళ్లిన అయిదుగురు కార్డు హోల్డర్ల లో నలుగురుకు బయో మెట్రిక్ అనుమతించక వెనుదిరిగారు. నెల్లూరు జిల్లా కావలికి చెందిన ఓ పెన్షనరు, చీమకుర్తికి చెందిన ఒకరు, సింగరాయకొండ, ఒంగోలుకు చెందిన వారికి బయో మెట్రిక్ ప్రక్రియలో సమస్యలు తలెత్తాయి. వీరు తొలుత ఆరోగ్య మిత్ర బెంచ్ పై కార్డు అప్రూవల్ చేయించుకున్నారు. ప్రాథమిక వైద్య పరీక్షలు, ఫొటో అప్ లోడ్ ప్రక్రియ పూర్తి చేసుకున్నారు.రెండో దశలో పేషంట్ కేస్ హిస్టరీ వివరాలు కూడా అప్ లోడ్ చేశారు. చివరి దశలో పేషంట్ అడ్మిషన్ కోసం బయో మెట్రిక్ వేయాలి. ఈ దశలో బయో మెట్రిక్ వద్ద వారికి చుక్కెదురయింది. ప్లీజ్ రిజిస్టర్ ఆధార్ నంబర్ విత్ యువర్ లాగిన్, ట్రై అగైన్ అనే మెసేజ్ రావడంతో ఆ నలుగురు ఇంటి బాట పట్టారు.

బయో మెట్రిక్ తిరకాసు...

ప్రభుత్వాలు మారినప్పుడల్లా అంతకు ముందు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు పేర్లు మార్చడం, వాటికి కొత్త పేర్లతో అమలు చేయడం నాలుగు దశాబ్దాలుగా కొనసాగుతుంది. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ ప్రభావితం చేసేదిగా (వాళ్ళ సొంత నిధులతో చేపట్టినట్లు) పథకాలు పేర్లు మార్చడం పరిపాటిగా మారింది. అంతవరకు బాగానే ఉన్నా పథకాల అమలు ప్రక్రియలో మార్పులు చేపట్టడం ఆనవాయితీగా వస్తుంది. మార్పులు - చేర్పులు ప్రక్రియ లబ్ధిదారులకు ఇక్కట్లు తెచ్చేదిగా ఉండటంతో తలనొప్పి పుట్టిస్తుంది. గత జూన్ నుంచి కూటమి ప్రభుత్వం ఎంప్లాయీస్ హెల్త్‌కార్డులకు బయో మెట్రిక్ తప్పనిసరి చేస్తూ మే 30న జీవో జారీ చేసింది. ఈ ప్రక్రియను జూన్ నెల నుంచి ఆరోగ్యశ్రీ పానల్ ఆసుపత్రుల్లో ఖచ్చితంగా అమలు చేస్తున్నారు. ప్రభుత్వ రంగంలో పనిచేస్తున్న ఉద్యోగులు, ఉద్యోగ విరమణ చేసిన వారికి ఈ జీవో గురించి, ప్రభుత్వం హెల్త్ కార్డులు మార్పులు చేపట్టిన అంశం గురించిన పూర్తి సమాచారం అందలేదు. దీంతో ఉద్యోగులు, పెన్షనర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

గందరగోళంలో ఇహెచ్ఎస్ లబ్ధిదారులు

ప్రభుత్వ నిబంధనలు మార్చడంతో ఇహెచ్ఎస్ కార్డులు మళ్లీ అప్ డేట్ చేసుకోవాలని కొందరు సూచిస్తున్నారు. మరి కొందరు ఆధార్ అప్ డేట్ చేయాలని, ఆధార్ లింక్ చేయాలని అందుకోసం గుంటూరు లోని ఇహెచ్ఎస్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. ఈ విషయం గందరగోళానికి గురి చేస్తుంది. వాస్తవంగా కార్డు హోల్డర్ ఆధార్ లింక్ ప్రక్రియ ఎన్‌టిఆర్ వైద్య సేవా విభాగం హెడ్డాఫీస్‌లో చేయాలి. అక్కడ జరుగుతున్న పొరపాటు కార్డు హోల్డర్లకు శరఘాతంగా పరిణమిస్తుంది.

పరిమితి రూ 5 లక్షలకు పెంచాలి

సిహెచ్.రాంబాబు, జిల్లా అధ్యక్షులు
ఆల్ పెన్షనర్స్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్

హెల్త్ కార్డులపై కేవలం రూ.2 లక్షలకు పరిమితి విధించారు. దీంతో గుండె జబ్బు, కిడ్నీ, నరాల వంటి దీర్ఘకాల ఆరోగ్య సమస్యలు ఉన్న పెన్షనర్ల వైద్యం కొన్ని సందర్భాల్లో రూ.5లక్షల పైబడి ఖర్చు చేయాల్సి వస్తుంది. ప్రతి పెన్షనరు నుంచి ప్రతి నెలా హెల్త్ కార్డులకుప్రభుత్వం ముక్కుపిండి వసూలు చేస్తుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం హెల్త్ కార్డుల పరిమితిని కనీసం రూ.5లక్షలకు పెంచాలి.

లోపాలు సవరించాలి...

జి శేషయ్య, జిల్లా కార్యదర్శి
ఆల్ పెన్షనర్స్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్

పరిమితమైన సేవలకు మాత్రమే ఉపకరిస్తున్న ఇహెచ్ఎస్ కార్డుల్లో తలెత్తే లోపాలను అధికారులు సవరించాలి. హెల్త్ కార్డులు అన్ని వ్యాధులకు వర్తింప జేయాలి. ముఖ్యంగా పెన్షనర్లకు ఆటంకంగా ఉన్న బయో మెట్రిక్ రద్దు చేయాలి.

వైసిపి కార్యకర్తలను పరామర్శిస్తున్న నాయకులు

వైసిపి కార్యకర్తలకు పరామర్శ

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

ఒంగోలు నగర పరిధిలోని 45వ డివిజన్‌కు చెందిన వైసిపి కార్యకర్తలు తమ్మినేని సిద్ధారెడ్డి, మూరక నారాయణరెడ్డి, భూమిరెడ్డి తిరుపతిరెడ్డి జైలు నుంచి బెయిల్‌పై శుక్రవారం విడుదలయ్యారు. ఈ సందర్భంగా జైలు వద్ద వైసిపి ఒంగోలు నియోజకవర్గ సమన్వయకర్త చుండూరి రవిబాబు నాయకత్వం లో పలువురు నాయకులు వారిని కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా రవిబాబు మాట్లాడుతూ కార్యకర్తలపై జరిగిన అన్యాయాన్ని పార్టీ తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. కష్టసమయంలో కార్యకర్తలకు వైసిపి అండగా ఉంటుందన్నారు.ఎన్ని కష్టాలెదురైనా పార్టీ వెన్నంటే నిలుస్తుందని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో వైసిపి ఒంగోలు నగర అధ్యక్షుడు కటారి శంకర్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పాలడుగు రాజీవ్, 45వ డివిజన్ ప్రెసిడెంట్ మాల్యాద్రి రెడ్డి, నియోజకవర్గ యువజన అధ్యక్షుడు మలిశెట్టి దేవా తదితరులు పాల్గొన్నారు.

29న జాషువా జయంతి సభ

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

విశ్వకవి గుర్రం జాషువా 130 జయంతి సభ ఈ నెల 29న స్థానిక ఎన్‌టిఆర్ కళాక్షేత్రంలో నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు అట్లూరి అమ్మయ్య, రాఘవులు, ఎన్.విజయశేఖర్, పి. జడ్సన్, జి.లాజర్, పి. వీరస్వామి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్, ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపల్ చింతకింది ఖాసీం, ఇండస్ట్రీయల్ ట్రిబ్యునల్ చైర్మన్ డి.రాములు, ఏపి టూరిజం చైర్మన్ నూకసాని బాలాజీ, ప్రముఖ రచయిత పాటిబండ్ల ఆనందరావు ముఖ్య అతిథులుగా హాజరు కానున్నట్లు పేర్కొన్నారు.

జూనియర్ ఇంటర్ కళాశాలలకు 28 నుంచి దసరా సెలవులు

ప్రజాశక్తి -ఒంగోలు సిటీ

జిల్లాలోని అన్ని యాజమాన్యాల జూనియర్ కళాశాలలకు ఇంటర్మీడియట్ బోర్డు అకడమిక్ క్యాలెండర్ ప్రకారం ఈనెల 29 నుంచి అక్టోబర్ 5 వరకు దసరా సెలవులు ప్రకటించినట్లు ఆర్ఐఒ కె. ఆంజనేయులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అన్ని యాజమాన్యం లోని ప్రిన్సిపల్స్ విద్యార్థులకు సెలవులు ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు. నిబంధ నలకు విరుద్ధంగా కళాశాలలు నిర్వహించినా, స్పెషల్ క్లాసులు నిర్వహించిన సంబంధిత యాజమాన్యాలపై శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

2న కార్మికులకు వైద్య శిబిరం

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

కలెక్టర్ సూచనల మేరకు సఫాయి మిత్ర సురక్ష సేవ కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య కార్మికులకు వచ్చేనెల 2న వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి ఎం. వెంకటేశ్వరరావు తెలిపారు. ఒంగోలు దక్షిణ బైపాస్ రోడ్డులోని జడ్‌పి సమావేశ మందిరంలో ఈ వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి, ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, ఒంగోలు, సంతనూతలపాడు ఎమ్మెల్యేలు దామచర్ల జనార్ధనరావు, బిఎన్. విజయకుమార్, కలెక్టర్ పి.రాజా బాబు హాజరు కానున్నట్లు తెలిపారు. ఈ వైద్య శిబిరంలో కిమ్స్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, ఆస్టర్ రమేష్ (సంఘమిత్ర) హాస్పిటల్, ఉపాస్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, శ్రీరామ్ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, రిమ్స్ హాస్పిటల్ వైద్యులు వైద్య సేవలు అందిస్తారన్నారు. జిల్లాలోని పారిశుధ్య కార్మికులు వైద్య శిబిరంలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

మెగా డిఎస్‌సి అభ్యంతరాల పరిష్కారానికి కమిటీలు : డిఇఒ

ప్రజాశక్తి -ఒంగోలు సిటీ

మెగా డిఎస్‌సి -2025 అభ్యర్థుల జాబితా మరియు తుది ఎంపిక జాబితాపై వచ్చిన అభ్యంతరాలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు డిఇఒ కిరణ్ కుమార్ తెలిపారు. అభ్యర్థుల సమస్యలు పారదర్శకంగా, నిర్ణీత కాలపరిమితిలో పరిష్కరించేందుకు జోనల్ స్థాయి మరియు రాష్ట్ర స్థాయి గ్రీవెన్స్ రెడ్రెస్సల్ కమిటీలు ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు.జోనల్ స్థాయి కమిటీకి రీజినల్ జాయింట్ డైరెక్టర్ అధ్యక్షత వహిస్తారన్నారు. ఆ జోన్‌కు ఇద్దరు జిల్లా విద్యా అధికారులు సభ్యులుగా ఉంటారని తెలిపారు. ఈ కమిటీ ఫిర్యాదులను స్వీకరించి 15 రోజుల్లో పరిష్కరించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయి కమిటీకి అదనపు డైరెక్టర్ (సర్వీసెస్) అధ్యక్షుడు, డిఎస్‌సి రాష్ట్రస్థాయి కన్వీనర్ మరియు జాయింట్ డైరెక్టర్ సభ్యులుగా ఉంటారని చెప్పారు. జోనల్ స్థాయి నిర్ణయంపై అప్పీలు వచ్చినా, వీరు 15 రోజుల్లో పరిష్కరిస్తారని తెలిపారు. చివరి అప్పీల్ అధికారిగా పాఠశాల విద్యా డైరెక్టర్ ఉంటారని, తుది నిర్ణయం వారిదేనని డిఇఒ వివరించారు.

రక్తదానం చేస్తున్న ప్రభుత్వ వైద్యకళాశాల ప్రిన్సిపల్

రక్తదానంతో ప్రాణదానం

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

రక్త దానం ప్రాణదానంతో సమానమని ఒంగోలు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అశోక్ కుమార్ తెలిపారు. స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ స్వయంగా విద్యార్థులతో కలిసి రక్త దానం చేసి ఆదర్శంగా నిలిచారు. జిజిహెచ్ బ్లడ్ బ్యాంక్ లో ఎంబిబిఎస్ విద్యార్థులతో కలిసి ఆయన రక్త దానం చేశారు. అదేవిధంగా పలువురు ప్రొఫెసర్స్ , సిబ్బంది విద్యార్థులు రక్త దానం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యాలు మెరుగుపరచాలి

జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

సాంఘిక సంక్షేమ హాస్టళ్లల్లోని విద్యార్థుల నైపుణ్యాలను మెరుగుపరచాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ అధికారులకు సూచించారు. సాంఘిక సంక్షేమ అధికారులు, విద్యాశాఖ అధికారులు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సాంఘిక సంక్షేమ వసతి గహాల్లోని విద్యార్థులకు ఆర్ట్ ఆఫ్ లివింగ్‌లో శిక్షణ ఇవ్వాలన్నారు. గురుకుల పాఠశాలలోని విద్యార్థులకు పోటీ పరీక్షలకు వారి నైపుణ్యాన్ని పెంచే విధంగా శిక్ష తరగతులు ఇవ్వాలన్నారు. సాంఘిక గిరిజన సంక్షేమ హాస్టల్లో జర్మన్ లాంగ్వేజ్ కోచింగ్ సెంటర్లను ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి రాజ్ దేబోరా, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ విజయమ్మ, ఆర్డబ్ల్యూఎస్ ఎస్సీ అనంతరాజు, ఈడబ్ల్యుఐడీసీ అధికారి భాస్కర్ బాబు పాల్గొన్నారు. సూపర్ జిఎస్‌టి, సూపర్ సేవింగ్స్ పై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ అధికారులను ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఒలతో వీక్షణ సమావేశం ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ

మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్ కుమార్

అక్టోబర్ 19 వరకూ సూపర్ జిఎస్‌టి, సూపర్ సేవింగ్స్ పేరుతో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. 2వ వారం వ్యవసాయ, అనుబంధ రంగాలకు సంబంధించి వస్తువులపై, విద్యా, పారిశ్రామిక సంబంధమైన వస్తువులపై, ద్విచక్ర, కార్లు వంటి వాహనాల పై అవగాహన కల్పించాలన్నారు. ఒకొక్క వారం ఒకొక్క అంశాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.ఈ సమావేశంలో జిఎస్‌టి కమీషనర్ మురళి కష్ట, సిపిఒ ఎఎస్.రాజు,డిపిఒ ప్రభాకర్ రావు, డిఎల్‌డిఒ .విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి : డిపిఒ

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

పరిశుభ్రత, మౌలిక వసతులు, పౌర ఆరోగ్య పరిరక్షణ, ప్రజా సమస్యల పరిష్కారం తదితర అంశాలపై దృష్టి సారించాలని జిల్లా పంచాయతీ అధికారి ఎం. వెంకటేశ్వరరావు తెలిపారు. ఎంపిడిఒ కె. రాజశేఖర్ రావుతో కలసి ఒంగోలు రూరల్ మండలం మండువారిపాలెం గ్రామాన్ని శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో సోర్స్ లెవల్లో చెత్త సేకరణ విధానాన్ని పరిశీలించారు. తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించేలా చర్యలు తీసుకోవాలని క్లాప్ మిత్రలను ఆదేశించారు.సాలిడ్ వేస్ట్ ప్రాసెస్ సెంటర్ షెడ్‌ను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. సీజనల్ వ్యాధులు రాకుండా శానిటేషన్‌పై జాగ్రత్తలు పాటించాలని ఎఎన్‌ఎం లకు సూచించారు. అవసరాన్ని బట్టి మెడికల్

ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డిపిఒ

క్యాంపులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు కార్యక్రమంలో గ్రామ సర్పంచి మండువ వెంకట సుబ్బయ్య, కార్యదర్శి సంజయ్ సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్లాఫ్ మిత్రలకు వైద్య పరీక్షలు

కార్మికులలకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - బాపట్ల

గ్రామాలు పట్టణాల్లో పారిశుద్ధ్య పనుల ద్వారా ప్రజల ఆరోగ్యాన్ని పరోక్షంగా పరిరక్షించే పారిశుద్ధ కార్మికులకు ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని ఎంపిడిఒ జి రామకృష్ణ అన్నారు. ఈస్ట్ బాపట్ల పంచాయతీ నందిరాజుతోటలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ వైద్య శిబిరాన్ని అప్పికట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ షేక్ ఉస్మాన్ గని ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. పారిశుద్ధ్య కార్యక్రమాలు చేసే క్లాప్ మిత్రులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పల్నాటి శ్రీరాములు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, సచివాలయం ఉద్యోగులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

క్రీడల్లో సత్తా చాటిన విద్యార్థులు

ప్రజాశక్తి - ముండ్లమూరు

రాష్ట్ర స్థాయి సాఫ్ట్ బాల్ బాల బాలికల విభాగంలో మండలంలోని ఉమామహేశ్వరపురం జెడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులు సత్తా చాటారు. సాఫ్ట్ బాల్‌కు బాలికల ఎంపిక టంగుటూరులోని జెడ్‌పి ఉన్నత పాఠశాలలో జరిగిన పోటీల్లో ఎంపికైనట్లు పిడి పేర్ని తిరుపతి స్వామి తెలిపారు. ప్రకాశం జిల్లా టంగుటూరు జెడ్‌పి ఉన్నత పాఠశాల్లో శుక్రవారం జరిగిన రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ సబ్ జూనియర్స్ బాలికల విభాగంలో 9మంది, బాలుర విభాగంలో ఒకరు ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను హెచ్‌ఎం బి మాధవి, పిఇటి పేర్ని తిరుప్పస్వామి అభినందించారు.

నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

టిడిపి నాయకుడు నారాయణరావు మృతి

ప్రజాశక్తి - అమృతలూరు

మండలంలోని పాంచాలవరం గ్రామంనకు చెందిన తెలుగుదేశం సీనియర్ నాయకులు జ్యోతి నారాయణరావు (డీలర్) (70) శుక్రవారం అనారోగ్య సమస్యల కారణాలతో మృతి చెందారు. ఆయన మృతదేహానికి శాసన సభ్యులు నక్కా ఆనందబాబు పూలమాలవేసి నివాళులర్పించారు. కుటుంబానికి సానుభూతి తెలిపారు. మృతుని కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలి

ప్రజాశక్తి - వేటపాలెం

మండలంలోని ఎస్సీ, ఎస్టీలు నివసిస్తున్న ప్రాంతాల్లో కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని, పేదలు నివసిస్తున్న స్థలాలకు బీ ఫారాలు ఇవ్వాలని, ఎస్సీ, ఎస్టీలకు నివేశ స్థలాలు లేని వారికి ప్రభుత్వం భూమి కేటాయించాలని బిఎస్‌పి నాయకులు చిట్టమల సంగీతరావు అన్నారు. రామన్నపేట పంచాయతీలోని బాబు జగజీవన్ నగర్ కాలనీకి స్మశాన వాటిక భూమి కేటాయించాలని కాలనీ వాసులతో తహశీల్దారును కలిసి విన్నవించుకున్నారు. బిఎస్‌పి నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్రామాల ఆదాయ వనరుల పెంపునకు కృషి

మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంపిడిఒ వెంకటస్వామి

ప్రజాశక్తి - పర్చూరు

మండలంలోని పంచాయతీల్లో సర్పంచులు, కార్యదర్శులు ఆదాయ వనరుల పెంపుకు కృషి చేయాలని ఇన్చార్జి ఎంపిడిఒ వెంకటస్వామి తెలిపారు. స్థానిక ఎంపిడిఒ సమావేశహాల్లో సర్పంచులు, కార్యదర్శులకు ఓన్ రిసోర్స్ సర్వే (ఓఆర్ఎస్)పై శిక్షణ శుక్రవారం ప్రారంభించారు. ముందుగా జాతిపిత మహాత్మా గాంధీ, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాల సమర్పించిన వాళ్ళ అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంతో పోలిస్తే పంచాయతీల ఖర్చులు పెరిగాయని చెప్పారు. ఖర్చులకు తగ్గ ఆదాయం రావడం లేదని తెలిపారు. పంచాయతీల్లో ఖర్చులన్నీ ఇంటి పన్ను వసూలుపైన ఆధారపడుతున్నారని తెలిపారు. సాధ్యమైనంత వరకు గ్రామాల్లోని వనరులు గుర్తించాలని చెప్పారు. వాటి ద్వారా ఆదాయం ఎలా పెంచాలో ప్రణాళికలు తయారు చేసుకోవాలని చెప్పారు. ఆదాయ వనరుల పెంపుపై దృష్టి సారించాలని కోరారు. పంచాయతీలకు వచ్చే నిధులు ఖర్చు చేసేటప్పుడు కూడా జవాబు దారితనం ఉండాలని చెప్పారు. జవాబు దారి తనం కొరకు ప్రభుత్వం స్వర్ణ పంచాయతీ యాప్ తయారు చేసిందని పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధికి సర్పంచ్, కార్యదర్శి సమన్వయంతో పని చేయాలని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ కొసన సత్యనారాయణ, కార్యదర్శిలు, సర్పంచులు పాల్గొన్నారు.

వేటపాలెం : పంచాయతీలు తమ పరిధిలో స్వీయ వనరులను సమర్ధవంతంగా వినియోగించుకోవాలని ఎంపిడిఒ మెడబలిమీ రాజేష్ బాబు సూచించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో పంచాయతీల స్వీయ వనరుల ఆదాయంపై శిక్షణ నిర్వహించారు. గ్రామీణాభివృద్ధికి బలమైన పునాదిగా మారనుందని చెప్పారు. ఓఎస్ఆర్ ద్వారా వచ్చే ఆదాయ వనరులు అనేకం ఉన్నాయన్నారు. ఇళ్లపన్ను, నీటి పన్ను, వ్యాపారాల లైసెన్స్ ఫీజులు, మార్కెట్ అద్దెలు, ఇసుక లీజులు, ప్రకటనల ఫీజులు, శుభ్రత రుసుంలు, జరిమానాలు ముఖ్యమైనవిగా తెలిపారు. ప్రభుత్వ నిధులు మాత్రమే కాకుండా స్వీయ వనరుల ఆదాయాన్ని పెంపొందించడం ద్వారా పంచాయతీలు స్వయం సమృద్ధిగా మారుతాయని అన్నారు. కార్యక్రమంలో పిఓపిఆర్డి అన్నం శ్రీనివాసరావు, మండల పరిషత్తు ఎఒ శ్రీదేవి, పంచాయతీ కార్యదర్శి పి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వేటపాలెం ఎంపిడిఒ ఎం రాజేష్‌బాబు

మత్తు పదార్థాల నిర్మూలనపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి - చీరాల

ఎన్ఆర్ అండ్ పిఎం హైస్కూల్ వాకర్స్ అసోసియేషన్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో సేవా పఖ్వాడ నషా ముక్త్ భారత్‌లో భాగంగా మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాల నిర్మూలనపై పట్టణంలో అవగాహన ర్యాలీ శుక్రవారం నిర్వహించారు. హైస్కూల్ మైదానం నుండి బస్ స్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. బస్ స్టాండ్ సెంటర్ వద్ద మానవ హారంగా ఏర్పడి యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని నినాదాలు చేశారు. వక్తలు మాట్లాడుతూ ధూమపానం, మద్యపానం, గంజాయి సేవనం వల్ల యువత అనేక ఆరోగ్య సమస్యలతో పాటు నేరాలకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో ఈపూరిపాలెం రైల్వే స్టేషన్ వద్ద జరిగిన ఒక బాలికపై సామూహిక అత్యాచారం, హత్య ఘటనను గంజాయి మత్తులో ఉన్నవారు పాల్పడ్డారని తెలిపారు. చదువుకునే యువత పెడదారి పట్టి డ్రగ్స్‌కు బానిసలు అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యువత అధికంగా ఉన్న భారతదేశాన్ని చెడగొట్టడానికి విదేశీ శక్తులు పనిచేస్తున్నాయని ఆరోపించారు. విదేశాల నుండి డ్రగ్స్ దిగుమతి అవుతున్నాయని పేర్కొన్నారు. విజయనగరం, శ్రీకాకుకుళం, ఒడిస్సా ప్రాంతాల్లో గంజాయి సాగు విస్తృతంగా జరుగుతోందని తెలిపారు. రైళ్లలో పోలీసులు డాగ్ స్క్వాడ్‌లను ఉపయోగించి తనిఖీలు నిర్వహిస్తూ పట్టుకుంటున్నారని గుర్తు చేశారు. చీరాలలో వ్యసన విముక్తి కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. తల్లిదండ్రులు తమ పిల్లలు పాఠశాల్లో ఏమి చేస్తున్నారో విచారించాలని కోరారు. పెద్దలు మద్యపానం అలవాటు ఉంటే మానుకోవాలని సూచించారు. గంజాయి, మాదక ద్రవ్యాలు విక్రయించే వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో న్యాయవాది బి హేమంత్ కుమార్, భవాని, కె బంగారుబాబు, జె వెంకటేశ్వరరావు, తాడివలస దేవరాజ్, పోలుదాసు రామకృష్ణ, వలివేటి మురళీకృష్ణ, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు నాగ వీరభద్రాచారి, డివి సురేష్, పోతుల సురేష్, రెడ్ క్రాస్ చైర్మన్ బూదరాజు శశికిరణ్, వందనం, మధుసూదనరావు పాల్గొన్నారు.

ర్యాలీ చేస్తున్న వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

రక్తహీనత లేకుండా చూసుకోవాలి

ప్రజాశక్తి - రేపల్లె

గర్భిణీలు సుఖ ప్రసవం కలగాలంటే రక్తహీనత లేకుండా సరైన పౌష్టికాహారం తీసుకోవాలని హెచ్‌ఎంఐఎస్ వ్యాలిడేషన్ టీం మల్లికార్జునరావు అన్నారు. మోళ్ళగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో లంకెవానిదిబ్బలో గర్భిణీలు, బాలింతలు, బాలికలకు రక్తహీనత పరీక్షలు, నమోదు ప్రత్యక్షంగా పరిశీలించారు. ఆకుకూరలు, పాలు, గుడ్లు, వేరు శనగ బెల్లంతో కూడిన ఉండలు తరచూ ఆహారంలో తీసుకోవాలని సూచించారు. రాగిజావ తీసుకోవాలని అన్నారు. హెచ్‌బి లెవెల్ దాదాపు 11 పాయింట్లు దాటేలా గర్భిణీలు చూసుకోవాలని అన్నారు. ప్రభుత్వం అంగన్‌వాడీల ద్వారా పోషకాహారాన్ని అందిస్తుందని తెలిపారు. వాటిని సక్రమంగా తీసుకోవాలని తెలిపారు. గర్భిణీలు ఆహారంలో ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవాలని చెప్పారు. గుడ్లు, పాలు క్రమం తప్పకుండా తీసుకోవడం ద్వారా రక్తహీనత నివారించవచ్చని వివరించారు. చిన్న పిల్లలకు ఐరెన్ సిరప్‌లు, పాఠశాల్లో పిల్లలకు, అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణీలకు ఐరెన్ మాత్రలు ఉచితంగా పంపిణీ చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో వ్యాలిడేషన్ టీం లక్ష్మణ్, మోళ్ళగుంట సూపర్వైజర్ వైవి రావు, సిహెచ్‌ఒలు లక్ష్మీదుర్గా, ఎలీజోయాని, ఎఎన్‌ఎం సుధా, శైలజ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మల్లికార్జునరావు

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న విజయ్ బాబు

హెచ్‌ఐవిపై అవగాహన

ప్రజాశక్తి - చీరాల

హెచ్ఐవి, ఎయిడ్స్, సుఖవ్యాధులు, క్షయవ్యాధి, డ్రగ్స్, మాదకద్రవ్యాలపై స్థానిక భారతి కళాశాలలో మహిళా మండలి ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా మండలి టిఐ, ఓఆర్‌డబ్ల్యు విజయ్ బాబు మాట్లాడారు. హెచ్‌ఐవి, ఎయిడ్స్ వ్యాధి ఎలా వస్తుంది, ఎలా వ్యాపించదని, దీనికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, హెచ్‌ఐవి బాధితుల పట్ల వివక్ష చూపకుండా సమాజంలో కలిసిపోవాల్సిన ఆవశ్యకతపై వివరించారు. క్షయ వ్యాధి, సుఖవ్యాధులు, చికిత్స విధానాలు, చెడు వ్యసనాల నుండి దూరంగా ఉండేలా యువతకు సలహాలు ఇచ్చారు. కండోమ్ వాడక ప్రయోజనాలు హెచ్‌ఐవి, ఎయిడ్స్ చట్టం 2017, ఎఆర్‌టి మందులు, ఎపి శాక్స్ యాప్, టోల్ ఫ్రీ నెంబర్ 1097 గురించి వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఐవి, ఎయిడ్స్ అవగాహన కరపత్రాలు విద్యార్థులకు పంపిణీ చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ సంజయ్, ఇంగ్లీష్ విభాగాధిపతి వెంకటరశ్వర్లు, అవుట్‌రీచ్ వర్కర్స్ జ్యోతి, దానమ్మ, సంధ్యారాణి, శిరీష, రాణి, శ్రీగీత, దివ్య బాను, విజయ్ బాబు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా అధికారి సోమల నాయక్

బాపట్ల : ఎయిడ్స్ మహమ్మారిని సమూలంగా నిర్మూలించేందుకు పల్లెలు, పట్టణ ప్రజలకు, విద్యార్థినీ, విద్యార్థులకు అవగాహన కల్పించాలని జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ బి సోమల నాయక్ అన్నారు. స్థానిక ఏరియా ఆసుపత్రిలో ఎయిడ్స్ నియంత్రణ చర్యలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. హెచ్‌ఐవి, ఎయిడ్స్ పరీక్షలు పెంచాలని అన్నారు. ఎపి సాక్స్ విభాగం జిల్లాకు నిర్దేశించిన లక్ష్యాలు పూర్తి చేయాలని అన్నారు. హెచ్‌ఐవి నిర్ధారణకు ప్రతి పేషెంట్ ఎఆర్‌టికి లింక్ చేయాలని అన్నారు. ఎఆర్‌టి కేంద్రాల ద్వారా హెచ్‌ఐవి భారిన పడిన వారికి మందులు అందజేయాలని అన్నారు. హెచ్‌ఐవి ఉన్న గర్భిణీ స్త్రీలకు 32 నుండి 36 ఏళ్ల మధ్య వైరల్ లోడ్ పెండింగ్ లేకుండా చూడాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిఎన్ ఎంఒ డాక్టర్ సాదిక్, క్లస్టర్ ప్రోగ్రామ్ మేనేజర్ జానీభాష, క్లినికల్ సర్వీస్ ఆఫీసర్ చైతన్య, క్లస్టర్ ప్రివెన్షన్ ఆఫీసర్ కిరణ్, టెక్నికల్ ఎక్స్ పర్ట్ శశిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎఒ మహేష్‌బాబు

నానో యూరియాపై అవగాహన

ప్రజాశక్తి - రేపల్లె

నానో యూరియా ఉపయోగించడం వల్ల రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చని ఎఒ ఎ మహేష్ బాబు పేర్కొన్నారు. మండలంలోని రాజుకాల్వలో పొలం పిలుస్తుంది కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. రైతులు వరి పంటపై రెండు, మూడో దఫాలో నానో యూరియా, నానో డిఎపి వాడాలని కోరారు. ప్రస్తుత వరిలో ఆకు ముడత పురుగు ఉధృతి ఎక్కువగా ఉన్నందున రైతులు తప్పనిసరిగా క్లోరో 50 ఈసీ 2.5 ఎంఎల్‌కి లీటర్‌కు లేదా నోవల్యూరాన్ 200 ఎంఎల్ మందులు పిచికారీ చేసుకోవాలని చెప్పారు. పురుగు ఉధృతిని బట్టి ప్రతి పురుగు మందులో వేప నూనె జత చేసుకొని వాడాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీఈఓ సతీష్ పాల్గొన్నారు.

ఆర్‌టిసి బస్సును ఢీకొన్న బొలెరో..

యువకుడు దుర్మరణం

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

ఆర్టీసీ బస్సును బొలెరో వాహనం ఢీకొన్నప్రమాదంలో యువకుడు దుర్మరణం చెందిన ఘటన శుక్రవారం వేకువజామున చోటుచేసుకుంది. బస్సు డ్రైవర్ కొండయ్య కథనం ప్రకారం రాజధాని అమరావతిలో రాష్ట్ర ప్రభుత్వం డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థులకు అపాయింట్మెంట్ ఆర్డర్ ఇవ్వడానికి ఒంగోలుకు చెందిన వారికోసం కనిగిరి డిపోకు చెందిన సూపర్ లక్జరీ బస్సు ఏర్పాటు చేశారు. అమరావతి నుండి బయలుదేరిన బస్సు మార్టూరు సమీపంలోకి రాగానే ఆ బస్సులోని ప్రయాణికుడికి అత్యావసరంగా మూత్ర విసర్జన సమస్య రావడంతో బస్సు ఆపమని డ్రైవర్‌ను కోరాడు. దీంతో జాతీయ రహదారిపై పోలీసు స్టేషన్ సమీపంలో ప్రక్కకు తీసి బస్సుని ఆపాడు. అదే సమయంలో తెనాలి రైల్వే స్టేషన్‌లో డెకరేషన్ పనులు నిమిత్తం వెళ్లిన కూలీలు బొలెరో వాహనంలో తిరిగి తమ స్వగ్రామం ఒంగోలుకు వెళుతున్నారు. వీరి వాహనం మార్టూరులో జాతీయ రహదారిపై నిలిపి ఉంచిన ఆర్టీసీ బస్సును బొలెరో డ్రైవర్ గుర్తించక వెనుక నుండి అతి

మృతుడు ప్రకాష్ (ఫైల్)

వేగంగా ఢీ కొట్టాడు. ఒక్క సారిగా జరిగిన ప్రమాదంలో బొలెరో వాహనంలో వెనుక వైపు డెకరేషన్ సామాను మధ్య నిద్ర పోతున్న ఒంగోలు సమీపంలోని త్రోవగుంట ఎస్సీ కాలానికి చెందిన రాయపాటి ప్రకాష్ (31) తీవ్రంగా గాయపడి అక్కడే కన్నుడే దుర్మరణం చెందాడు. ప్రక్కనే ఉన్న మరో కూలి గాయపడ్డాడు. సమాచారం అందుకున్న మార్టూరు సీఐ మాదినేని శేషగిరిరావు సిబ్బందిని అప్రమత్తం చేసి ఘటన స్థలానికి చేరుకున్నారు. మృతుడి బంధువులకు సమాచారం ఇచ్చారు. పోస్టు మార్టం నిమిత్తం మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రమాదానికి కారణమైన ఆర్టీసీ బస్సును పోలీసు స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్ కొండయ్యను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

తరలొచ్చిన త్రోవగుంట ఎస్సీ కాలనీ వాసులు

బ్రతుకు తెరువు కోసం కూలి పనికి వెళ్లి మరో గంటలో ఇంటికి చేరుకొనే సమయంలో రోడ్డు ప్రమాదం చోటుచేసుకొని తమ కాలనీకి చెందిన యువకుడు మృతి చెందడంతో త్రోవగుంట కాలనీ వాసులు పెద్ద ఎత్తున మార్టూరు ప్రభుత్వ వైద్యశాలకు చేరుకున్నారు. కాలనీ వాసులు విలపించిన తీరు చూపరులను కలిచివేసింది. మృతుడికి భార్య, ఇద్దరు మగ పిల్లలు ఉన్నారు. అర్ధరాత్రి వేళ జాతీయ రహదారిపై నిర్లక్ష్యంగా బస్సు నిలిపి యువకుడి ప్రాణాలు పోవడానికి కారణమైన ఆర్టీసీ నుండి మృతుడి కుటుంబాన్ని ఆదుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలని మృతుడి బంధువులు డిమాండ్ చేశారు.

చెక్కును అందజేస్తున్న మేనేజర్ సీనా నాయక్

బీమా చెక్కు అందజేత

ప్రజాశక్తి - బల్లికురవ

మండలంలోని ముక్తేశ్వరంకు చెందిన మాసాని మల్లి కార్జున ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన కుటుంబ సభ్యులైన మసాని రామసుబ్బయ్యకు ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ చీఫ్ మేనేజర్ శీనా నాయక్ రూ.2 లక్షల బీమా చెక్కును శుక్రవారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకు ఖాతా కలిగిన ప్రతి ఒక్కరికి ప్రధాన మంత్రి జీవనజ్యోతి బీమా పథకంలో చేరి ఉంటే అనారోగ్యం లేక ప్రమాదం పాలైతే ఆ కుటుంబానికి రక్షణగా ఉంటుందని తెలిపారు. ఈ పథకాన్ని ఖాతాదారులు సద్విని యోగం చేసుకోవాలని అన్నారు. భారత ప్రభుత్వం ఈ పథ కాన్ని అమలు చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెం ట్ మేనేజర్ బిందు మాధవి, సుహిత, గ్రేస్ పాల్గొన్నారు.

ఎజిపి రామకోటయ్య నేడు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - అద్దంకి

ఎజిపి రామకోటయ్య

పట్టణంలోని కోర్టు సముదాయంలో న్యాయవాది బత్తుల రామకోటయ్య ఎజిపిగా శనివారం బాధ్యతలు స్వీకరిస్తున్న ట్లు తెలిపారు. ప్రభుత్వ న్యాయవాదిగా కూటమి ప్రభుత్వం రామకోట య్యను నియమించిందని తెలిపారు. దీనికి సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వులు విడుదల చేసింది.

మాట్లాడుతున్న అంగన్‌వాడీ సూపర్ వైజర్

పోషకాహారంతో పిల్లల ఎదుగుదల

ప్రజాశక్తి - మార్టూరు

రాష్ట్రీయ పోషణ మాసోత్సవాల్లో పోషిత్ భారత్ భారత్‌లో భాగంగా స్థానిక విజయనగర్ కాలనీ నందు ర్యాలీ శుక్రవారం నిర్వహించారు. సూపర్వైజర్ టి శిరీష అంగన్ వాడి కార్యకర్త శాంతకుమారి తల్లిదండ్రులు మాట్లాడారు. స్థానిక గొట్టిపాటి హనుమంతరావు నగర్ కాలనీలో ఆరేళ్లలోపు పిల్లల సంరక్షణ వారి పోషకస్థితి, ఈ వయసు లో వారి మెదడు అభివృద్ధి, చిన్నపిల్లల ఆహారపు అలవాట్లు స్థూలకాయ నివారణకు చక్కెర, నూనె వినియోగం తగ్గించాలని చెప్పారు. బాల్య దశ సంరక్షణ విద్య తదితర అంశాలు వివరించారు. హెచ్‌వి పెర్సి, ఎంఎల్‌హెచ్ పి నాగేశ్వరరావు, ఎఎంఎం శివకుమారి, ఆశా, అంగన్‌వాడి కార్యకర్తలు వి రమాదేవి, వి సునీత పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సంతమాగులూరు సిడిపిఒ డి సుధ

సంతమాగులూరు : గర్భిణీలు, బాలింతల సమయంలో పురుషుల భాగస్వామ్యం తప్పనిసరిగా ఉండాలని, తద్వారా వాళ్ల శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉండి మంచి బిడ్డలకు జన్మనిస్తారని సిడిపిఒ డి సుధ తెలిపారు. మండలంలోని ఏల్చూరులోని రైతు సేవా కేంద్రంలో 8వ రాష్ట్రీయ పోషణ మహోత్సవాల్లో మాట్లాడారు. అంగన్‌వాడి సెంటర్లలో నవచేతన ప్రోగ్రాంలో గర్భిణీ దశ నుండి ప్రేరణ కలిగించడం, 0 నుండి రెండేళ్ల పిల్లలతో మమేకం అవడం ద్వారా వాళ్ల మానసిక స్థితి అభివృద్ధి చెందుతుందని అన్నారు. మహిళల ఆరోగ్య పరిరక్షణను దృష్టిలో పెట్టుకుని వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహిళల్లో వచ్చే బ్రెస్ట్, గర్భస్థ క్యాన్సర్లు, ఇతర వ్యాధులపట్ల ముందస్తు పరీక్షలు చేయించుకుంటే ప్రాథమిక దశలోనే జబ్బును గుర్తించి వైద్యం చేయవచ్చని సూచించారు. వెయ్యి రోజుల ప్రణాళిక అనేది గర్భిణీ దశ నుండి రెండేళ్ల వరకు ఉన్న కాలం గోల్డెన్ డేస్ అని వివరించారు. కార్యక్రమంలో సర్పంచి మందా సూరిబాబు, పంచాయతీ కార్యదర్శి పూర్ణచంద్రరావు, సూపర్వైజర్ ప్రమీల పాల్గొన్నారు.

పంట కోత ప్రయోగాలపై శిక్షణ

ప్రజాశక్తి - అద్దంకి

జాతీయ స్థూల ఉత్పత్తి అంచనా వేయడానికి పంట కోత ప్రయోగాలు కీలక పాత్ర పోషిస్తాయని ఎడిఎ బి ఎఫ్రాయిం అన్నారు. స్థానిక చిన్ని శాంతయ్య మీటింగ్ హాలులో అద్దంకి, కొరిశపాడు వివిఎలకు పంట కోత ప్రయో గాలపై శిక్షణ నిర్వహించారు. మార్టూరు ఎఇఒ ప్రసాద్ మాట్లాడుతూ పంట ఉత్పత్తుల ఎగుమ తులు, దిగుమతులు పంట కోత ప్రయోగాలపై ఆధార పడి ఉంటుందని తెలిపారు. అద్దంకి సహాయ గణాంకా ధికారి ఆర్ అమర్నాథ్ మాట్లాడుతూ పంట కోత ప్రయో గాలతో వచ్చే దిగుబడుల ఆధారంగానే పంటల భీమా పథకం వర్తిస్తుందని తెలిపారు. ఎఒ కొర్రపాటి వెంకట కృష్ణ, కొరిశపాడు ఎఒ రామ్మోహనరెడ్డి పాల్గొన్నారు.

పంగులూరు : పంట కోత ప్రయోగాలపై రైతు సేవా కేంద్రాల సిబ్బందికి శుక్రవారం శిక్షణ ఇచ్చారు. ఎఒ డి సుబ్బారెడ్డి అధ్యక్షతన పంట కోత ప్రయోగాల వలన రైతాంగం సాగుచేసిన పంటల దిగు బడిపై అంచనా వస్తుందని అన్నారు. సరాసరి దిగుబడి గనుక తక్కువ వస్తే పంటల భీమా చేయించుకున్న రైతుకు బీమా పరిహారం పొందే అవకాశం ఉంటుందని చెప్పా రు. ఎఎస్ఒఎస్ అనూష మాట్లాడుతూ పంట కోత ప్రయోగాలు వ్యవసాయ రంగంలో ప్రధానమైనదని చెప్పారు. పంట దిగుబడిని సరిగా అంచనా వేయటా నికి ఉపయోగ పడుతుందని చెప్పారు. దేశీయంగా ఆహార ధాన్యాల ఉత్పత్తి తెలుసుకోవచ్చని చెప్పారు.

మార్టూరు రూరల్ : రైతు సేవా కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి ఎఒ రామినేని లావణ్య ఆధ్వర్యంలో పంట కోత ప్రయోగాలపై శిక్షణను ఎఎస్ఓ ప్రసాద్ శుక్రవారం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం నూతన పరిజ్ఞానంతో ప్రవేశపెట్టిన ఎపి సిసి యాప్ ద్వారా పంట కోత ప్రయోగాలు నిర్వహించే విధానాన్ని

మాట్లాడుతున్న అద్దంకి ఎడిఎ బి ఎఫ్రాయిం

రైతు సేవా కేంద్రం సిబ్బంది సద్వినియోగం చేసుకో వాలని కోరారు. ఉద్యాన అధికారి హనుమంత్ నాయక్ సిబ్బందికి సూచనలు చేశారు.

చెరుకుపల్లి : పంట నమోదు వివరాలు సూపర్ చెక్ యాప్ ద్వారా తనిఖీ చేయడం ద్వారా అవకతవకలకు ఆస్కారం లేకుండా పొరపాట్లకు తావివ్వకుండా జరుగుతుందని ఎఒ ఎండి ఫారూఖ్ అన్నారు. మండ లంలోని చెరుకుపల్లి, ఆరుంబాక, బలుసులపాలెం, తుమ్మలపాలెం గ్రామాల పరిధిలో సూపర్ చెక్ యాప్ పద్ధతిలో పంట నమోదు వివరాలు రికార్డు చేశారు. రైతు పేరు, పంట రకం, పంట పేరు, సర్వే నెంబరు వివరాలు సరిగా ఉన్నాయో, లేదో పరిశీలించి సూపర్ యాప్‌లో నమోదు చేయనున్నట్లు తెలిపారు. ఎఇఒలు రామకృష్ణ, ప్రియాంక, విఆర్ఒలు పాల్గొన్నారు.

పర్చూరు : మండల కేంద్రమైన పర్చూరు వ్యవసాయ మార్కెట్ యార్డులోని రైతు సేవా కేంద్రంలో వ్యవసాయ సబ్ డివిజన్‌లోని నాలుగు మండలాల్లోని వివిఎ పంటలకు కోత ప్రయోగంపై శిక్షణ నిర్వహించినట్లు ఎడిఎ ప్రవీణ పేర్కొన్నారు. ప్రత్తి, మొక్కజొన్న, మిరప, వరి కోత ప్రయోగంపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎఒలు కె భాస్కరరావు, ఎం మేరెమ్మ, ఎఎస్ఓ శ్రీమన్నారాయణ, వివిఎలు పాల్గొన్నారు.

గుంతల మయంగా కొమ్మాలపాడు రహదారి

ప్రజాశక్తి - సంతమాగులూరు

మండలంలోని కొమ్మాలపాడు, పరిటాలవారిపాలెం గ్రామాల మధ్య ఆర్ అండ్ బి 10 కిలోమీటర్ల రహదారి అడుగడుగున గుంతల మయంగా అధ్వానంగా మారింది. కనీసం రోడ్డుపై ఏర్పడిన గుంతలను పూడ్చే నాధుడే లేరని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. కొమ్మాలపాడు జంక్షన్ నుండి ఈ రహదారిలో మామిళ్లపల్లి, కుందుర్రు, పరిటాల వారిపాలెం గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ప్రతినిత్యం ఆటోలు, లారీలు, మోటారు సైకిళ్ళు, ఆర్టీసీ బస్సులు తిరుగు తుంటాయి. ఈ రహదారిపై రాత్రులందు ఆటోలు, మోటార్ సైకిలిస్టులు రోడ్డుపై గుంతల్లో పడి ప్రమాదాలకు గురైన ఘటనలు ఉన్నాయి. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం చిలకలూరిపేట నుండి మార్టూరు, బల్లికురవ, కొమ్మాలపాడు మీదుగా ఆర్టీసి

గుంటలు పడి అధ్వానంగా ఉన్న రోడ్డు

బస్సు పరిటాల వారి పాలెం గ్రామాన్ని చేరుకుంటుంది. రోడ్డు గుంతలుగా మారడంతో వాహనాలు గంటల తరబడి నడుస్తున్నాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఈ రహదారిని నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ భవనం

అసంపూర్తిగా అంగన్‌వాడీ భవనం

ప్రజాశక్తి - సంతమాగులూరు

మండలంలోని ఏల్చూరు, కుందుర్రు, మక్కెనవారిపాలెం, పుట్టావారిపాలెం, కొమ్మాలపాడు, కొప్పరం గ్రామాల్లో 2014లో చేపట్టిన అంగన్‌వాడీ భవన నిర్మాణాలు నేటికీ అసంపూర్తిగా మిగిలిపోయాయి. ఈ భవన నిర్మాణాలు ఎంజిఎన్ఆర్ఇజిఎస్ నిధులతో చేపట్టారు. ఏల్చూరులో 7 భవనాలు శ్లాబ్ మట్టానికి నిర్మించి రూ.49 లక్షలు ఖర్చు చేశారు. కుందుర్రులో రెండు భవనాల నిర్మాణానికి రూ.20 లక్షలు, పుట్టావారిపాలెంలో ఒక భవన నిర్మాణానికి రూ.7లక్షలు, కొమ్మాలపాడులో ఒక భవన నిర్మాణానికి రూ.7లక్షలు, కొప్పరంలో భవన నిర్మాణానికి రూ.5లక్షలు ఖర్చు చేశారు. ఇంత ఖర్చు చేసి నిర్మించిన అంగన్‌వాడీ భవనాల నిర్మాణం పూర్తిగాక శిథిలావస్థకు చేరుతున్నాయి. శ్లాబ్ మట్టానికి నిర్మించిన భవనాలు కొన్ని గ్రామాల్లో పశు వుల కొష్టాలుగా మారుతున్నాయి. నూతన భవనాల్లో ఉండాల్సిన అంగన్‌వాడి సెంటర్లు, అరకొర వసతులున్న భవనాలు అద్దెకు తీసుకుని నెలకు రూ.2 వేలు అద్దె చెల్లిస్తున్నారు. సంతమాగులూరు ఐసిడిఎస్ పరిధిలోని మూడు సెక్టార్లలో 70 అంగన్‌వాడీ సెంటర్లు ఉన్నాయి. అందులో 16 సెంటర్లలో సొంత భవనాలు లేక అంగన్‌వాడి పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు సమస్యను మంత్రి గొట్టిపాటి రవికుమార్ దృష్టికి తీసుకువెళ్లారు. అయినప్పటికీ స్పందించిన దాఖలాలు లేవని సంబంధిత అధికారులు చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి అసంపూర్తిగా మిగిలిపోయిన భవన నిర్మాణాలు తిరిగి పునర్ నిర్మించాలని అంగన్‌వాడి కార్యకర్తలు, పిల్లల తల్లిదండ్రులు, స్థానికులు కోరుతున్నారు.

మాట్లాడుతున్న డిఆర్‌ఒ చిన ఓబులేసు

ఓటరు ఒక ఓటు మాత్రమే కలిగి ఉండాలి

డిఆర్‌ఒ బి.చిన ఓబులేసు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఎన్నికల నిబంధనల ప్రకారం ప్రతి ఓటరు ఒక ఓటు మాత్రమే కలిగి ఉండాలని జిల్లా రెవెన్యూ అధికారి బి.చిన ఓబులేసు తెలిపారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు డిఆర్‌ఒ ఛాంబర్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్‌ఒ మాట్లాడుతూ రెండేసి ఓట్లు కలిగిన వారు వెంటనే ఓ ఓటును రద్దు చేసుకుని, నివాసం ఉన్న చోట మాత్రమే ఓటు హక్కు కలిగి ఉండాలన్నారు. ఓటుకు ఆధార్ అనుసంధానం చేసుకోని వారు చేసుకోవాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన యువత ఓటుకు ం చేసుకోవాలని కోరారు . ఈ కార్యక్రమంలో ఒంగోలు ఇన్‌ఛార్జి ఆర్‌డిఒ కళావతి, కనిగిరి ఆర్‌డిఒ కేశవర్ధనరెడ్డి,స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఎస్.జాన్సన్,ఎ.కుమార్, ఎస్.వరకుమార్, సత్యనారాయణ, కె.రవీంద్రారెడ్డి జిల్లా ఎన్నికల విభాగ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, తహశీల్దార్లు చిరంజీవి, శివశంకర్, బివి. భాస్కర్ రెడ్డి, మంజునాథ్ రెడ్డి, ఆంజనేయ రెడ్డి, వైసిపి ప్రతినిధి దామరాజు క్రాంతికుమార్, టిడిపి ప్రతినిధి వెంకటరావు కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి ఎస్‌కెజసైదా, ఎస్‌కె రసూల్, బిజెపి ప్రతినిధి గుర్రం సత్యం, సిపిఎం ప్రతినిధి బి. రఘురామ్, ఆప్ ప్రతినిధి సుదర్శన్, జిల్లా ఎలక్షన్ డిటీ ఉపేంద్ర, డిటీ రాజశేఖర్ రెడ్డి, ఒంగోలు డిటీ సలోమి పాల్గొన్నారు.

రుణాల లక్ష్య సాధనకు కృషి

- ఉపాధి కల్పన యూనిట్లు ఏర్పాటు
- అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు

మాట్లాడుతున్న కలెక్టర్ రాజాబాబు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలకు కేటాయించిన రుణాల లక్ష్యాలను సాధించడంతో పాటు జిల్లాలో ఉపాధి కల్పన యూనిట్స్ ఏర్పాటును ప్రోత్సహించాలని కలెక్టర్ పి.రాజా బాబు అధికారులను ఆదేశించారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడేలా జిల్లా అధికారులు, బ్యాంకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన డిస్ట్రిక్ట్ కన్సల్టెటివ్ కమిటీ (డిసిసి), డిస్ట్రిక్ట్ లెవెల్ రివ్యూ కమిటీ (డిఎల్ఆర్‌సి) బ్యాంకర్స్‌తో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో 2025- 26 ఆర్థిక సంవత్సరంలో మొదటి త్రైమాసికంలో జిల్లాలోని అన్ని బ్యాంకులకు నిర్దేశించిన పలు రకాల రుణ లక్ష్యాలు, సాధించిన ప్రగతిని ఆయా బ్యాంకుల ప్రతినిధులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అధికారులు, బ్యాంకు అధికారులు సమన్వయంతో పనిచేసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలకు కేటాయించిన రుణాల లక్ష్యాలను ఖచ్చితంగా సాధించాలన్నారు. ప్రతి కుటుంబం నుంచి ఒక పారిశ్రామికవేత్త ఉండాలనే లక్ష్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పని చేస్తున్నారని, అందుకనుగుణంగా యూనిట్స్ స్థాపనపై బ్యాంకర్లు, అధికారులు సమన్వయంతో యాక్షన్ ప్లాన్ తయారు చేయాలన్నారు. జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడేలా బ్యాంకర్లు, అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. జిల్లాలో ఉపాధి కల్పన యూనిట్స్ ఏర్పాటును ప్రోత్సహిస్తూ నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడేలా పిఎంఇజిపి, ముద్ర, పిఎం విశ్వకర్మ లాంటి కేంద్ర, రాష్ట్ర పథకాలకు సంబంధించిన రుణాల లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. ముఖ్యంగా పిఎం సూర్య ఘర్ పథకంపై ప్రజలకు విస్తతంగా అవగాహన కల్పించి నిర్దేశించిన లక్ష్యాలను సాధించేలా చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులను, బ్యాంకర్లను కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో లీడ్ జిల్లా మేనేజర్ రమేష్, డిఆర్‌డిఎ, మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్లు నారాయణ, శ్రీహరి, జిల్లా వ్యవసాయ అధికారి డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు, జిల్లా పశుసంవర్ధక అధికారి డాక్టర్ బి.రవి, మత్స్య శాఖ జేడీ శ్రీనివాస రావు, ఎస్‌సి కార్పోరేషన్ ఇడి అర్జున్ నాయక్, సిపిడిసిఎల్ ఎస్ఇ కట్టా వెంకటేశ్వర్లు, జిల్లా ఉద్యాన అధికారి గోపి చంద్, వివిధ శాఖల జిల్లా అధికారులు, బ్యాంకుల కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

అభివృద్ధిలో జిల్లా ముందుండాలి

బాపట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

బాపట్ల జిల్లా అభివృద్ధిలో అన్ని విభాగాలలో మొదటి మూడు స్థానాలలో ఉండేలా అధికారులు ప్రత్యేక దష్టి పెట్టి పని చేయాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ తెలిపారు. గ్రామ శ్రేయస్సు స్థితి స్థాపక ప్రణాళిక తయారీ, గ్రామ,మండల,జిల్లా స్థాయిలో (జిపిడిపి) ప్రణాళికలు తయారీ అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ సమావేశం శుక్రవారం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాపట్ల జిల్లా అభివద్ధిలో అన్ని విభాగాలలో మొదటి మూడు స్థానాలలో ఉండేలా అధికారులు ప్రత్యేక దష్టి పెట్టి సమన్వయంతో పని చేయాలన్నారు. పేదరికం లేని, విస్తత జీవనోపాదులు కలిగిన గ్రామం, ఆరోగ్యకర గ్రామం, స్నేహపూర్వక పిల్లల గ్రామం, సమద్ధికర నీరు కలిగిన గ్రామం, పరిశుభ్రత, పచ్చదనం కలిగిన గ్రామం, స్వయం సమద్ధి వసతులతో కూడిన గ్రామం, సామాజిక న్యాయం, సామాజికత భద్రత కలిగిన గ్రామం, మంచి పాలనతో కూడిన గ్రామం, స్నేహపూర్వక మహిళల గ్రామాల కోసం కృషి జరగాలన్నారు.బడిలో డ్రాప్ అవుట్ లు తగ్గించడం, నాణ్యమైన విద్య, పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు, బాల కార్మిక వ్యవస్థ నుంచి విముక్తి. అక్రమ రవాణా లేకుండా చేయడం అన్ని రకాలైన హింసలకు వ్యతిరేకంగా పిల్లలకు సురక్షితమైన వాతావరణం కల్పించాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్డీఏ ఇంచార్జి పీడి లవన్న,డిపిఓ ప్రభాకర్ రావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్ కుమార్

కలెక్టరేట్ లో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు

మన జిల్లా, మన బాపట్ల అనే సంకల్పంతో అధికారులు పనిచేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్ తెలిపారు. జిల్లా కలెక్టరేట్ లోని న్యూ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో కమాండ్ కంట్రోల్ రూమ్‌లో విధులు నిర్వహించే సిబ్బందితో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మన జిల్లా, మన బాపట్ల అనే సంకల్పంతో జిల్లా అధికారులందరూ పనిచేసి, రాష్ట్ర అభివద్ధిలో బాపట్ల జిల్లా మొదటి మూడు స్థానంల్లో ఉండేలా కషి చేయాలన్నారు. ప్రస్తుతం జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, దీని ఎదుర్కొనడానికి జిల్లా యంత్రాంగం సమర్థవంతంగా పని చేయాలన్నారు. అధికారులు ఓప్రణాళిక ప్రకారం లక్ష్యాలు నిర్దేశించుకుని వాటిని సాధించడానికి అందరూ ఇష్టంతో పని చేయాలన్నారు. కమాండ్ కంట్రోల్ రూమ్‌లో విధులు నిర్వహించే సిబ్బందికి కలెక్టర్ పలు సూచనలు చేశారు.డిఆర్‌ఒ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఇన్‌ఛార్జి సంయుక్త కలెక్టర్ గంగాధర్ గౌడ్, జిల్లా కలెక్టరేట్ పర్యవేక్షకులు, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

సూపర్ జిఎస్టి సూపర్ సేవింగ్స్ పై వేడుకలు

సూపర్ జిఎస్‌టి, సూపర్ సేవింగ్స్ పై నెల రోజుల పాటు వేడుకలు నిర్వహించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ తెలిపారు. సీజనల్ కండిషన్స్, పిఎం కుసుమ్, కంప్రెస్డ్ బయో గ్యాస్ ప్లాంట్లు, సోలార్,విండ్ ప్రాజెక్టులకు సంబంధించిన భూసంబంధిత అంశాలపై రాష్ట్ర సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ జిల్లా కలెక్టర్లతో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బాపట్ల జిల్లా నుంచి కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్, ఇన్‌ఛార్జి సంయుక్త కలెక్టర్ గంగాధర్ గౌడు, వివిధ శాఖల జిల్లా అధికారులు , సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : ఎస్‌పి

ప్రజాశక్తి- ఒంగోలు సబర్బన్

జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉనందున పోలీస్ అధికారులు సిద్ధంగా ఉండాలని, ప్రజలు కూడా అప్ర మత్తంగా ఉండాలని ఎస్‌పి హర్షవర్ధన్ రాజు తెలిపారు. పోలీసు శాఖ ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సర్వసన్నద్ధమైనట్లు ఆయన తెలిపారు. ప్రత్యేక బలగాలతో బందాలను ఏర్పాటు చేసి, ఏ ఆపద వచ్చినా తక్షణ సహాయం అందించడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. నదులు, వాగులు, వంకల పరివాహక ప్రాంతాల్లో ముఖ్యంగా లోతట్టు ప్రాంతాలలోని ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. అవసరమైన ప్రాంతాల్లో సహాయక శిబిరాలు, పునరావాస కేంద్రాలు గుర్తించి అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సముద్ర తీరం వెంబడి నివసిస్తున్న ప్రజలు పోలీస్ అధికారులు, రెవెన్యూ అధికారులు సూచించిన విధంగా ఆయా ప్రాంతాలను ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాలకు లేదా తుఫాన్ షెల్టర్లకు వెళ్ళాలని సూచించారు. ఉధతంగా ప్రవహించే నదీ పరీవాహక ప్రాంతాలలో ముమ్మరంగా గస్తీ నిర్వహించాలన్నారు. ప్రయాణించేందుకు అనువుకాని మార్గాల్లో, నీట మునిగిన రహదారుల వద్ద పికెట్స్ ఏర్పాటు చేసి రహదారులను మూసివేయాలన్నారు. భారీ వర్షాల నేపథ్యంలో మత్స్యకారులు సముద్రం, వాగులు, చెరువుల్లో చేపల వేట వెళ్లరాదని తెలిపారు. ఎలాంటి ప్రాణనష్టం సంభవించకుండా పోలీస్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో తక్షణ సహాయం కోసం డయల్ 112, పోలీస్ వాట్సాప్ నెంబర్ 9121102266 లేదా స్థానిక పోలీసు అధికారులకు సమాచారం అందించాలని ఎస్‌పి తెలిపారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

బాపట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

జిల్లాలో వర్షాలు కురుసున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ తెలిపారు. పేర్కొన్నారు. ప్రజలు కొన్ని ముఖ్య మైన జాగ్రత్తలు పాటించడం వల్ల సీజనల్ వ్యాధుల బారీ నుంచి తమను రక్షించుకోవచ్చునని తెలిపారు. తమ చుట్టుపక్కల ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రతి నిత్యం చేతులను సబ్బుతో కడుక్కొవాలి. కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. ఈ పద్ధతులు పాటించడం వల్ల సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఆరోగ్యంగా ఉండవచ్చునని కలెక్టర్ పేర్కొన్నారు.